# వెండితెర వెనుక

నవల

సత్తిబాబు



శ్రీ
కౌముది
మీ మనసుల్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 26

# వెండితెర వెనుక
## సత్తిబాబు





గత ౩౫ సంవత్సరాలుగా తెలుగు సినీరంగంలో దర్శకత్వశాఖలో విశేషమైన అనుభవం ఉన్న రచయిత కలంనుంచీ
౧౯౭౮ ప్రాంతాల్లో మద్రాసులోని తెలుగు చలనచిత్ర రంగానికి అద్దం పట్టే నవల.

"గుడ్ మార్నింగ్ రంగ బాబుగారూ"

"గుడ్‌మార్నింగ్"

"శేషాచలం గారి పిక్చర్ చేస్తున్నారటగా!"

"అవును"

"మీకోసం అయిదు సార్లు మీ ఆఫీసుకొచ్చాను. ప్రతిసారీ మీరేదో పనిమీద వెళ్ళారని మీ ఆఫీస్‌బోయ్ చెబుతూనే ఉన్నాడు. అందుకనీ ఇక్కడ అడక్క తప్పడం లేదు."

"మొదటి షెడ్యూల్ ఊటీలో సాంగ్స్ తీస్తున్నాం. దీంట్లో కేరక్టర్సేం లేవు. వచ్చే నెలలో వాహినీ స్టూడియోలో ఇరవై రోజులు కంటిన్యూగా షూటింగ్ ఉంటుంది. ఆ షెడ్యూల్లో ఏదన్నా ట్రై చేస్తాను."

"వచ్చే నెల్లో రమ్మంటారా"

"ఒకటి, రెండు తారీఖుల్లో రండి మా డైరక్టర్ గారికి కూడా ఒకసారి చూపిస్తాను."

"ఉంటాను సార్! ఏదన్నా గుర్తింపుండే వేషం ట్రై చెయ్యండి సార్..."

"అలాగే"

అతను వెళ్ళిపోయాడు.

నేను పాండీబజార్ బయలుదేరాను. సాయంత్రం పూట రవ్వ ఇడ్లీ - సాంబారు తినటం ఒక అలవాటు. పాండీ బజార్లో నా తోటి అసోసియేట్ డైరక్టర్లతో కాసేపు హస్కు కొట్టి, శాంతాభవన్‌లో దూరాను. టిఫిన్ చేసి శాంతా భవన్ రూఫ్ గార్డెన్ మెట్లు దిగుతుంటే, ఓ ఎర్రటి కుఱ్ఱాడు చాలా స్పీడ్‌గా నన్ను తోసుకుంటూ పైకెళ్ళాడు. వెనక్కి తిరిగి చూసాను. జీన్సు, పాలిష్ చేసిన బ్లాక్ షూ, గోల్డ్ రిమ్డ్ కూలింగ్ గ్లాసెస్ - చాలా టైమ్ తీసుకుని మేకప్ అయ్యుంటాడు. అతను ఏ.సి రూము ముందు ఆగాడు. అంతలో బిలబిలమంటూ పదిమంది అతని చుట్టూ చేరారు. ఒకతను చాలా జాగ్రత్తగా తలుపు తెరిచాడు. ఆ కుర్రాడు చాలా హుందాగా లోపలికి అడుగు పెట్టాడు. మిగిలిన వాళ్ళు కుడా లోపలికి వెళ్ళి గ్లాస్ డోర్‌ని 'టప్' మని మూసారు! అనుకోకుండా ఓ నిట్టూర్పు విడిచాను. సినిమాల్లో

వేషాలకోసం వచ్చుంటాడతను. వచ్చి వారం కంటే ఎక్కువయ్యుండదు. అందుకే ఆ స్పీడు తగ్గలేదు. రెండు మూడు నెలల తర్వాత అతన్ని చూడాలి! ఆ చుట్టూ ఉన్న పదిమందిలో ఒక్కడు కూడా ఉండడు. ఎందుకో మనసు చాలా బాధగా మూలిగింది.

***

పాండీ బజార్లో బస్ కోసం నిలబడ్డాను. నా భుజం మీద ఒక బలం లేని చెయ్యి పడేసరికి వెనక్కి తిరిగి చూసాను... "మూర్తి"!

"ఏరా ఇలా చిక్కిపోయావేంటి" అన్నాను.

"ప్రస్తుతం కంపెనీ లేదుగా! రేషనింగ్." అన్నాడు మూర్తి!

రేషనింగ్ అంటే లిమిటెడ్ మీల్స్! అదీ ఒక్కపూటే! ఒక్కొక్కసారి ఆ ఒక్క పూట కూడా ఉంటే ఉంటుంది లేకపోతే లేదు.

"శేషాచలం గారి కంపెనీలో చేస్తున్నావటగా !"

"అవును"

"అడ్వాన్స్ ఇచ్చారా?"

"లేదు! రెండు, మూడు రోజుల్లో ఇవ్వచ్చు."

"ఉంటే ఓ 'టెన్' ఇవ్వరా! కంపెనీ రాగానే ఇచ్చేస్తా"

జేబులో వున్న ఇరవై రూపాయల్లో నుండీ పదిరూపాయలు వాడికిచ్చాను..

"థాంక్స్‌రా! వస్తాను"

మూర్తి చాలా ఆనందంగా, పరుగెడుతున్నట్లు వెళ్ళిపోయాడు. నాకు నవ్వొచ్చింది! ఈ పదిరూపాయలు రేపు ఉదయంతో అయిపోతాయి.మళ్ళీ మామూలే! కానీ ఈ క్షణంలో ఆ పది రూపాయలు పదివేలకంటే ఎక్కువ! నేనూ చాలాసార్లు ఇలా బాధపడ్డాను. మొహమాటంతో, ఎవర్నీ అడగలేక రెండు, మూడు రోజులు పస్తులున్న రోజులు కూడా ఉన్నాయి. రేపు ఎలా గడుస్తుందీ, అనే భయం అనుక్షణం పీడిస్తూనే ఉండేది. ఇన్ని బాధలూ.. భయాల్లో కూడా సినీఫీల్డు వదలలేని బలహీనత.. అదేంటో ఇప్పటికీ తెలియదు...!

నా బస్సు వచ్చింది. ఎక్కి పవర్ హౌస్ దగ్గర దిగి, మా ఇంటి కాంపౌండు గేట్లోనుండి వస్తుంటే, మా ఇల్లుగలవాళ్ళ అమ్మాయి చిరునవ్వు విసిరింది. నేనూ నవ్వి మేడమెట్లు ఎక్కాను. మేడ మీద నాకొక్కటే రూము! ఏ గొడవాలేదు. కిటికీ తలుపులు తెరిస్తే చక్కని గాలి! దూరంగా థియేటర్ బానర్ మెరుస్తూ కనబడుతుంది.

రూమ్ తలుపు తెర్చి లైట్ వేసాను. కాళ్ళ దగ్గర రెపరెపలాడ్తూ తెల్లని స్క్రీన్ పేపర్! నవ్వుకుని పేపరు విప్పాను.

✷✷✷

"గుడ్ మార్నింగ్ రంగ బాబుగారూ"

"గుడ్‌మార్నింగ్"

"శేషాచలం గారి పిక్చర్ చేస్తున్నారటగా!"

"అవును"

**రంగా!**

మై డార్లింగ్.....

నీకోసం మధ్యాహ్నం కాలేజీ ఎగ్గొట్టి వచ్చాను. ఫస్ట్‌షో టై!ం వరకూ, నీ రూం దగ్గరే కూర్చున్నాను తెలుసా! మీ ఇల్లు గల వాళ్ళమ్మాయి - రెండు, మూడు సార్లు బయటకొచ్చి - పర్టిక్యులర్‌గా నన్ను చూసి వెళ్ళింది! చూస్తే నాకు భయమేంటిగాని, ఐయామ్ టూ మచ్ డిసప్పాయింటెడ్! ఏడుకొండలెక్కితే ఆ దేవుడైనా కనిపిస్తాడంట! కానీ - ఇరవై ఆరు మెట్లు ఎక్కొచ్చి, రెండు వందల నలభై నిమిషాలు ఎదురు చూసినా...........

నీ -

జయ...

***

స్టెల్లా మేరీస్ ముందున్న పేవ్‌మెంట్ రెయిలింగ్స్‌ని ఆనుకుని నిలబడాను. విసుగు పుడుతోంది. పొద్దున చాలా ఆలస్యంగా లేవడం వల్ల, హడావిడిగా తయారయ్యి, టిఫిన్ కూడా తినకుండా వచ్చి, ఇలా కాలేజీ ముందు పడిగాపులు కాస్తున్నాను. జట్లు జట్లుగా ఎంతో మంది అమ్మాయిలు వస్తున్నారు కాని, జయ అంతు లేదు.

నూటొకటోసారి వాచీ చూసుకుని, విసుగ్గా తలెత్తి దూరంగా - గుంపువైపు చూసాను. ఒక గ్రూపు అమ్మాయిలు వస్తున్నారు, అడుగులో అడుగువేసుకుంటూ! హంసగమనలు...! ఆ గ్రూప్‌నే తదేకంగా చూస్తున్నాను. వాళ్ళ మధ్యలోనే జయుంది. గంటనుండీ పడిన శ్రమంతా పోయి, జయని చూడగానే ఒంట్లో షేకింగ్ వచ్చింది. రెయిలింగ్స్ మీదనుండీ చేతులు తీసి నవ్వాను!

సమాధానంగా పదిమంది అమ్మాయిలూ నవ్వి సైగలు చేసారు, ఒక్క జయ తప్ప! నోరు వెళ్ళబెట్టి చూస్తుండగానే అంతా కిలకిలా నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయారు! జయ కనీసం వెనక్కి తిరిగి కూడా చూడలేదు.... టట్!... ఇంకా ఇక్కడిలాగే నిలబడుంటే, రోమియోగాడనుకుని, మక్కెలిరగ్గొట్టి, వాన్ ఎక్కిస్తారు, పోలీసులు... ..ఛ. అనవసరంగా ఆఫీసు మాని రావడం నాదే బుద్ధి తక్కువ!

చాలా అసహనంగా రోడ్ క్రాస్ చేసి, ఫుట్‌పాత్ మీద నడవడం మొదలుపెట్టాను. ఫర్లాంగు నడవగానే ప్రక్కన ఆటో వచ్చి ఆగింది. లోపల్నుండీ తొంగి చూసి నవ్వుతుంది. ఒంట్లోని విసుగంతా కళ్ళతో చూపించాను.

"రా... రంగా" అని చెయ్యి పట్టుకుని ఆటోలోకి లాగింది. గంటసేపు నాక్కలిగిన శ్రమ... జయ నిర్లక్ష్యం జ్ఞాపకానికి వచ్చి, ఒళ్ళంతా ఉడికి పోయింది. "కోపం వచ్చిందా?" అంది.

"ఊఁ.... ఆఁ... అహ!..."

"అబ్బాయిగారికి నిజంగానే కోపం వచ్చిందే!" అని నా భుజం మీద నుండీ తన చేయిజాపి, నా ముఖాన్ని తనవైపుకు తిప్పుకుంది.

"ఉహూ.." ... అని తల విదిలించాను.

రెండు చేతులతో నా ముఖాన్ని పట్టుకుని" నావైపు చూడ్డం కూడా ఇష్టం లేదా!" అని తనవైపు తిప్పుకుంది.

జయ కళ్ళలోకి చూసాను. విశాలమైన కళ్ళు... నిర్మలంగా... వింత కాంతితో మెరుస్తున్నాయి. ఆ కళ్ళల్లోకి చూడగానే నా ఒంట్లో మరలా షేకింగ్!... జయ నడుం చుట్టూ చేయి వేసి దగ్గరకి...

"ఎంగె పోణం"... అన్నాడు ఆటోడ్రైవర్!

"ఎక్కడికెడదాం" అంది జయ!

"ఆకలేస్తుంది" అన్నాను.

"ఉడ్లాండ్స్ డ్రైవిన్" అంది....

జయ ఇడ్లీని సాంబారులో ముంచుతోంది. చల్లగా వీచే గాలికి, విరబోసిన జుట్టు, ముఖం మీద కెరటాల్లాగా ఆడుతుంది. గుండ్రని ముఖం... చక్కని ముక్కు... చిన్ని పెదాలు...! పెదాలు తెరచి నవ్వినప్పుడు, మెరుపులాగా మెరిసే తీరైన పళ్ళు...

"అలా కొత్తగా చూస్తున్నావేంటి!"...

"నిన్నే"...

"ఏంటి బాబు! ఇంత మందిలో అలా కన్నార్పకుండా చూస్తుంటే... సిగ్గేస్తోంది!" సిగ్గుపడుతూ తలొంచుకుంది. గాలి విసురికి వెంట్రుకలు ముఖం కప్పివేసాయి. తలవంచుకునే మెల్లిగా వెంట్రుకలు సరిచేసుకుంది....

"నిన్ను చూస్తుంటే ఇప్పుడేమనిపిస్తోందో చెప్పనా!"

"ఊఁ"

"గట్టిగా, ఆ ఎర్రని పెదాలు, ఇంకా ఎర్రపడేలా"..... ముద్దు పెట్టుకోవాలనిపిస్తోంది"

"పో రంగా! ఇలాగే మాట్లాడితే నే వెళ్ళిపోతాను".

"వెళ్ళు... నేనూ ఆఫీసుకి వెళతాను"

"కాలేజీ ఎగ్గొట్టింది, నిన్ను ఆఫీసుకి పంపడానికా!"

"నువ్వేగా పొమ్మన్నావ్"....

"పొమ్మనంగానే... వెళ్ళిపోతావా!" అంది రోషంగా...

"నా జయ కోపంలో కూడా అందంగానే ఉంటుంది.." అన్నాను.

జయ బుగ్గలు ఆపిల్ పళ్ళలాగా ఎరుపెక్కాయి. క్రింద పెదిమని పై పళ్ళతో అదిమి పట్టింది....

సప్లయిర్ బిల్లు తెచ్చాడు. బిల్లు పే చేసి బయటకొచ్చాం.

"ఇప్పుడేం చేద్దాం!" అన్నాను.

"బ్లూడైమండ్‌లో కంటిన్యూ షోస్‌గా అక్కడకు పోదాం"

జయ అరచేతిని నా చేతిలో బిగించి రోడ్డు మీద నడుస్తుంటే, ఏదో ఆధిక్యత!

"ఏం ఆలోచించావు రంగా!!"

"దేని గురించి"

"అంత అమాయకంగా అడక్కు"

"నా సమాధానం నీకు తెలియదా జయా"!

"నా కోసం ఈ ఒక్క పనీ చేయలేవా!"

.............................

"నువ్వు తీసుకునే నిర్ణయం మీదే మన పెళ్ళి ఆధారపడి ఉంది!".. అది నీకూ తెలుసు....

..........

"నాన్నకి సినిమావాళ్ళంటే ఎంత అసహ్యమో!... వాళ్ళు చేయి పెడితే గంగాజలంలో కూడా పురుగులు పడతాయంటాడు"

"చాలు"! అని అరిచాను.

జయ కళ్ళెత్తి చూసింది...

"నేను చేసుకోబోయేది, నిన్నా - మీ నాన్ననా!"

"కొంచెం ప్రాక్టికల్‌గా ఆలోచించు రంగా! నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను... ఎక్కడికి రమ్మంటే అక్కడకు వస్తాను! కానీ"....

"కానీ"....

"నువ్వు సినిమా ఫీల్డు, మద్రాసు వదిలిపెట్టవు! ఇక్కడ నాన్న సపోర్టు లేకుండా బ్రతకలేం రంగా! కక్ష తీర్చుకోవడానికి నాన్న ఏదైనా చేస్తాడు."

"నన్నేం చేయమంటావ్"

"ప్లీజ్, ఒక్కసారి నన్ను కళ్ళముందు పెట్టుకుని ఆలోచిము."

..................

"నువ్వు గ్రాడ్యుయేట్‌వి! నాన్నతో చెప్పి ఎలాగో మన పెళ్ళికి ఒప్పిస్తాను! నువ్వు అసోసియేట్ డైరెక్టర్ పని మానేస్తే.. నాన్నే ఏదైనా జాబ్ వేయిస్తాడు!... కాదనకు ప్లీజ్..."

..................

"నా డిగ్రీ పూర్తి చేయడానికి ఇంకా ఒన్ అండ్ హాఫ్ ఇయర్ ఉంది. ఈ లోగా ఒక నిర్ణయం తీసుకోవచ్చు!... కానీ"...

...............

"కానీ... ఈ సంవత్సరంన్నర రోజూ నేను టెన్షన్ ఫేస్ చేస్తూనే ఉండాలి! అయినా పరవాలేదు - నీ నిర్ణయం అప్పటికి 'ఫర్'గా ఉంటే చాలు."

'సఫైర్' కాంప్లెక్సు వచ్చింది. రెండు నూన్‌షోలు, కంటిన్యూస్ షో ఆడుతున్నాయి. జనం టిక్కెట్ల కోసం లైన్లో నిలబడున్నారు.

"నేను వెడతాను జయా"

"కోపం వచ్చిందా" అంది భయం భయంగా!

"ఛ. కోపం ఎందుకూ! రాత్రి నీ ఉత్తరం చదవగానే వెంటనే చూడాలనిపించింది! నీ గురించే ఆలోచన!.... చాలా ఆలస్యంగా నిద్రపోయాను. ఉదయం నిన్ను కలవాలని, ఆఫీస్ మాని వచ్చాను.. ఆఫీసులో మా డైరెక్టర్ గారు ఎదురుచూస్తుంటాం! ఈ వారంలో ఊటీ వెళుతున్నాము! ఆ పనులన్నీ ఉన్నాయి." అని అప్పు చెప్పాను.

జయ అలాగే జనంలో నిలబడి ఉంది.

ఆటో కదిలి మిగిలిన వెహికల్స్‌లో కలిసి పోయింది. జెమినీ స్టూడియో దగ్గర ఆటో మలుపు తిరిగింది. డ్రైవిన్ దగ్గర నుండి - జెమిని స్టూడియో వరకూ నిలబెట్టిన బేనర్లు తళుకులతో మెరుస్తున్నాయి! అన్ని బేనర్లలో డైరెక్టర్స్ పేర్లు ప్రామ్‌నెంటుగా కనబడుతున్నాయి!... అలాగ నా పేరు ఎప్పుడు పడుతుంది?... పదిమంది నా పిక్చర్ గురించి ఎప్పుడు అనుకుంటారు?....

కాలం పరిష్కారం ఎలా చెబుతుందో?....

✷✷✷

"రంగ బాబు గారూ! ఒకార్టిస్టొచ్చాడు అతనికెలాగైనా, ఏదో ఒక వేషం ఇవ్వాలి!" అన్నాడు ప్రొడక్షన్ మానేజర్.

"ఎందుకనో"...

"నో ఆబ్లిగేషన్ తప్పదు"

"అతని కోసం - మీరింతగా శ్రమపడి పోతున్నారే ... ఏదన్నా ఆమ్యామ్యా...

"ఛ. ఛ.. అదేం లేదండీ.... కుర్రాడు బాగున్నాడు కదా అని"...

"తీసుకురండి" ✷✷✷

ప్రొడక్షన్ మేనేజర్ ఆ కుర్రాడిని వెంట తీసుకొచ్చాడు. అతన్ని చూడగానే గుర్తించాను - ఒకరోజు శాంతాభవన్‌లో నన్ను డాషిచ్చి వెళ్ళిన కుర్రాడు!

"వీరు అసోసియేట్ డైరక్టర్ రంగబాబు - వీరు గగన్ కుమార్ - ఆర్టిస్ట్"

"గ్లాడ్ టు మీట్ యు సర్" అన్నాడు గగన్ కుమార్.

"సేమ్ విత్‌మి ! కూర్చోండి."

"థాంక్యూ"....

"ఇంతకుముందు ఏ పిక్చర్లు చేసారు".... ఇంతవరకూ అతనికెక్కడా వేషం దొరికుండదని నాకు గారంటీగా తెలుసు! అయినా అడగాలి, మనహోదా మనదే!

"చాలా ఆఆఫర్లున్నాయండి! అన్నీ ఇంపార్టెంట్ రోల్సే. శ్రీకాంతే అన్నయ్యగా ఒక పిక్చర్‌లో బుక్కయ్యాను. కాంతిశ్రీతో హీరోగా ఒకదాంట్లో బుక్ అయ్యాను! ఇంకా నాలుగయిదున్నాయి."

"మా పిక్చర్‌లో మెయిన్ రోల్స్ అన్నీ అయిపొయ్యాయి! ఒకటి - రెండు డైలాగులున్న వేషాలున్నాయి! మీ కిష్టమైతే...."

"సారీ సర్! కొంచెం ప్రామినెంట్‌గా ఉండేవి వేస్తే ఇమేజ్ పెరుగుతుంది."

"మొత్తానికి ఒక్క వేషం కూడా వెయ్యకుండా ఇమేజ్ సంపాదించారన్నమాట"...

గగన్ కుమార్ నా కళ్ళలోకి పరిశీలనగా చూశాడు. నేను ముఖంలో ఏ భావం వ్యక్తం చేయక పోయినా - వేళాకోళం చేస్తున్నట్లు భావించాడనుకుంటా, జేబులోంచి కొన్ని పేపర్ కటింగ్స్ తీసి నా కందించాడు

' -తెరకి కొత్తముఖం గగన్ కుమార్"

"హీరోలకి - హీరో - గగన్‌కుమార్"

- ఇలాగే మరికొన్ని పబ్లిసిటీ మాటర్స్!

"బాగున్నాయి.... అయితే" అని చెప్పబోయేంతలో బూట్లు శబ్దం చేసుకుంటూ డైరక్టరుగారొచ్చారు.

"గుడ్‌మార్నింగ్... ఇండోర్ షూటింగ్ ప్రోగ్రామ్ వేసావా... రంగబాబూ"

"వేసాను సార్"

"అది తీసుకుని నా రూమ్‌కి రా!" అని వెళ్ళబోతూ... "ఇతనెవరు".... అని అడిగాడు!

"గగన్ కుమార్ అని ఆర్టిస్టు సార్"

"నమస్తే సార్" అన్నాడు గగన్ కుమార్.

"నమస్తే... నీ కాండేటా రంగబాబు! అయితే ఓ పనిచేయి! పాపాయమ్మ తమ్ముడి వేషం ఇవ్వు!

"ఒకటి - రెండు డైలాగుల వేషం వేస్తే ఇమేజ్ పోతుందట సార్" అని పేపర్ కటింగ్స్ ఇచ్చాను....

"ఐ.సీ!" అని పేపర్ కటింగ్స్ చూసి "చూడు బాబు! నువ్వు పెద్ద హీరో అయింతర్వాత, వచ్చే సంవత్సరం మేమే నీ దగ్గరకొస్తాం! అప్పుడు నీ కాల్‌షీట్లు మాకు దొరికి, నన్ను ఇదే కంపెనీలో - తర్వాతి పిక్చర్క్కూడా డైరక్టర్‌గా పెట్టుకుంటే, అప్పుడు పెద్ద పిక్చర్‌కి పనిచేద్దాం!" అని ఆయన ఎంత హడావిడిగా వచ్చారో, అంతే హడావిడిగా తన రూమ్‌కి వెళ్ళిపోయారు.

డైరక్టర్ గారి వ్యంగ్యం గ్రహించలేదతను. మహా సంబరపడిపోతూ "ఉంటాను రంగబాబుగారు" అన్నాడు

"మంచిది"....

"మర్చిపోవద్దు"

"అలాగే"... అన్నాను. అతను హుందాగా వెళ్ళిపోయాడు. షెడ్యూల్ పేపర్స్ పట్టుకుని డైరక్టర్‌గారి రూమ్‌లో అడుగు పెట్టాను!

పాండీ బజార్లో పక్షులు తెగ అరుస్తున్నాయి! ఇలా కాకులు గోల పెట్టినయ్యంటే - తప్పకుండా ప్రళయం ఏదో ఉందన్నమాటే! ప్రళయం ఏమయ్యుంటుందా, అని ఆలోచిస్తూ వెడుతున్నాను. "ఢమ్...ఢమ్" లక్ష్మణరావు చెయ్యిపట్టుకు ఆపాడు. (అతనేదో పాత పిక్చర్లో కామెడీ వేషం వేసాడట. ప్రతిడైలాగులో అతను 'ఢం...ఢం' అనడం వల్ల ఆ పేరు సెటిలయింది అతనికి)

"ఢం...ఢం' ఏమిటి విశేషం."....

"విశేషం ఉంది గురువుగారు! ఈ రోజు కాకులు అరుస్తున్నాయి గమనించారా!"

"ఆc..."

"అవెందుకరుస్తాయో తెలుసా"

"ఊcహు తెలియదు..."

"మీ పాండీ బజార్లో ఎక్కువ తిరగరు కదూ! అందుకని మీకు 'కా' భాష.. ఛ..ఛ..కాకి భాష తెలీదు."

"చంపక విషయం చెప్పవయ్యా"

"అక్కడే ఉంది గురుగారూ తమాషా! "

"కాఫీ డబ్బులిస్తా చెప్పు"

"ఛేంజ్ వద్దు గుర్గారూ! నోటుగా ఇవ్వండి, రెండిడ్లీలు కూడా తింటాను."

"కొత్తగిరాకీ ఏదీ తగల్లేదా - నన్ను పట్టుకున్నావ్..."

"ఎక్కడ గుర్గారూ! కాంపిటీషన్ పెరిగిపోయింది! ఎవడన్నా కొత్తార్టిస్టు వస్తున్నాడంటే కొంతమంది బేసిన్ బ్రిడ్జివరకూ వెళ్ళి పట్టుకుంటున్నారు. ఇక కొత్త పార్టీ పిక్చర్ తీయడానికి వస్తున్నారంటే బెజవాడ దగ్గిరే పట్టుకుంటున్నారు! మనం పాండీబజారు - సెంట్రల్ తప్పితే వేరేచోటికి వెళ్ళంగా గుర్గారూ!...."

"మనం... అంటే నన్ను కూడా కలుపుతున్నావా!"

"సారీ... గుర్గారూ! మనం... అంటే నేనే"...

"సరే ఉంటాను..." అని కదలబోయాను.

"అదిగో మళ్ళీ కాకి అరిచింది చూసారా!"

"ఓహ్హో! నీకు రూపాయివ్వాలి కదూ!" అని రూపాయిచ్చి,

"ఇప్పుడు చెప్పు విషయం"

"మన మూర్తిగారు డైరెక్ట్ చేస్తున్నారు..."

"ఆ!....."

"మీరు నమ్మరని నాకు తెలుసు! 'నెల్రకితం నా దగ్గర పదిరూపాయలు అప్పుతీసుకున్నాడు, ఇంకా అప్పు తీర్చలేదు,- అప్పుడే ఎలా డైరక్ట్ చేయగలుగుతున్నాడని' ఆశ్చర్యపడుతున్నారు కదూ!"

నిజంగా ఆశ్చర్యంతో నోరు తెరిచి "నేను పదిరూపాయలు అప్పిచ్చినట్లు నీకెలా తెలుసు..."

"ఇహ్హిహ్హి! గుర్గారూ! సినీ ఫీల్డులో జరిగిన ప్రతివిషయాన్నీ, పాండీబజార్లో ప్రతి చెట్టూ, ఆకూ పది నిమిషాల్లో "నోట్" చేస్తుందనే విషయం మీకు తెలీదా!" అని ఎగురుకుంటూ వెళ్ళిపోయాడు...

మూర్తి డైరెక్ట్ చేస్తున్నాడన్నమాట....

"ఇలా పార్టీని టాకిల్ చేసారా! ఏదో ఒకరోజు అదృష్ట దేవత వచ్చి, తలుపు తడుతుందని - తలుపు దగ్గర కూర్చుంటే, నట్లాడి తలుపే నెత్తిమీద పడుతుంది. మన ఫీల్డులో పెద్దవాళ్ళు కావాలంటే, పెద్దోళ్ళని ముంచాలి! నెలకి పదిరోజులు లాటరీలు కొడుతూ, పది సంవత్సరాలు గడిపాం! ఇంకా సహించే ఓపిక పోయింది. రోజులు గడుస్తూనే ఉన్నాయి! వయసు పెరిగిపోతూనే ఉంది. ఇలాగే ముసలి వాళ్ళం కూడా అయిపోతాము! కొన్నాళ్ళు పోతే... - మూర్తి మంచి అసోసియేటే - కానీ... డైరెక్షన్ చేయగలడో - లేదో అంటారు..." అన్నాడు మూర్తి!

"నీ కెరీర్ అంతా ఈ పిక్చర్ తర్వాత ఇంకో పిక్చర్ రాకపోతే మనం మళ్ళీ అసోసియేట్‌గా చెయ్యలేం, చేసినా ఎవరూ పెట్టుకోరు. అదీ ఆలోచించాను! ఎంతో కష్టపడి సంపాదించిన అవకాశం పోగొట్టుకోవడం ఇష్టం లేదు!"

"విష్ యు ఆల్ ద బెస్ట్"

"థ్యాంక్యూ! కుర్రాణ్ణి పంపాను! మందొస్తుంది, కొంచెం పుచ్చుకెళ్ళకూడదూ!..."

"థాంక్స్‌రా! నీ పిక్చర్ ఓపినింగ్‌కే మనిద్దరం కూర్చుంటాం - ఉంటాను..."

బయటికొచ్చిన తర్వాత మందు తాగాలనిపించింది. ఉదయమే శేషాచలంగారి పిక్చర్ డబ్బు సెటిల్ చేసారు. ఆటో వేసుకుని కామధేను కెళ్ళి 'ఆఫ్ మెక్డోవెల్ బ్రాంది" అన్నాను.

"నమస్తే రంగబాబుగారు"

ప్రక్కకి చూసాను. గగన్ కుమార్!

"హల్లో... ఏమిటి... మందుకోసమా"

"అవునండీ... మీరేం తీసుకున్నారు?"

"మెక్డోవెల్ బ్రాందీ"

షాపతను నా సీసా తెచ్చిచ్చాడు. "డబ్బులు నేనిస్తాను" అన్నాడతను.

"థాంక్స్! వద్దు సార్" అని పే చేసాను.

గగన్‌కుమార్ ఒక హాఫ్ తీసుకున్నారు.

"మీరెక్కడికెడుతున్నారు" అని అడిగాడు గగన్‌కుమార్.

"నా రూమ్‌కి..."

"మీ కభ్యంతరం లేకపోతే నా రూముకి రండి"

'థాంక్యూ సర్! నా కభ్యంతరమేమిటి - పక్షిని' అన్నాడు.

వింతగా అతని ముఖంలోకి చూసాని.

"ఏమీ లేదు సార్! మెంటల్‌గా ఏమీ బాగోక అలా అన్నాను", అన్నాడు.

ఇద్దరం ఆటో ఎక్కాం!

"మొన్న డైరక్టర్ మూర్తిగారిని కలిసాను. మాటల్లో మీ విషయం వచ్చింది! 'రంగబాబు చాలా ప్రిన్సిపుల్డ్ వర్కర్! నా దగ్గర అసోసియేట్‌గా పని చెయ్యమని అడుగుదామని అనుకున్నాను. కానీ ఇద్దరం ఒకే కంపెనీలో అసిస్టెంట్స్‌గా, రెండు సంవత్సరాలు కలిసి పనిచేసాము. అతను నా దగ్గర అసోసియేట్‌గా చేయడానికి ఫీల్ కాడు. నేనే రంగబాబుని అడగడానికి ఫీలయి అడగలేకపోయాను అన్నారు. మూర్తిగారితో ఉన్న పరిచయంలో, ఆయన అందర్నీ విమర్శించగా విన్నాను కానీ, పొగడగా వినలేదు. అప్పట్నుండీ మిమ్మల్ని మరొకసారి కలిసి మనస్ఫూర్తిగా మాట్లాడాలనుకున్నాను. ఇలా కలుసుకున్నాం" అన్నాడు.

"థాంక్యూ..." అన్నాను.

హాలీవుడ్ హోటల్లో బిర్యానీ కట్టించుకుని రూమ్‌కి వచ్చాం! రెండుగ్లాసుల్లో మందు పోసి, ఒకటి అతనికిచ్చి "ఛీర్స్" అన్నాను.

"ఛీర్స్" అన్నాడు!

గట్టిగా ఒక గల్ఫ్‌లాగాను. చాలా రోజుల తర్వాత త్రాగటం వల్ల భారంగా ముందు లోపలికెళ్ళింది! గగన్‌కుమార్ చాలా ఈజీగా త్రాగేశాడు.

"మీకు డ్రింకు బాగా అలవాటనుకుంటాను" అన్నాను.

"అలవాటు లేదు సార్, ఈ మధ్యనే చేసుకున్నాను."

"అవును! మన సొసైటీలో ఇదొక ఫాషన్"

"ఫేషన్ కోసం కాదు సార్, ఆలోచనలతో నిద్రపట్టడం లేదు. ఇది వేసుకుంటే మర్నాడు తొమ్మిది గంటల వరకు గొడవలేకుండా నిద్రపోవచ్చు"

"నిద్ర పట్టనన్ని సమస్యలు మీకేమున్నాయి... నాలుగు పిక్చర్స్‌లో హీరోగా బుక్అయ్యారు! ఇంకా నాలుగు పిక్చర్స్‌లో ప్రామినెంట్ కారెక్టర్స్ వేస్తున్నారు. ఇంకా చాలామంది ప్రొడ్యూసర్లు..."

"ప్లీజ్ మీరూ జోక్ చెయ్యకండి సార్."

నేను ఆశ్చర్యంగా అన్నాను!" మీరు చెప్పిందేగా కుమార్!... జోకేముంది!"....

"మోసపోయాను సార్!... పూర్తిగా మోసపోయాను!... "

"ఎక్స్‌క్యూజ్‌మి - నేనింకో రౌండ్ వేసుకుంటాను... మీలా స్లోగా త్రాగలేను." అని గ్లాస్ సగం వరకూ, మందు పోసుకుని అతి తక్కువగా నీళ్ళు కలుపుకుని, గటగట తాగేసాడు.

నేను చాలా ఆఆశ్చర్యంగా చూస్తున్నాను.

"సార్! నేనొకటి అడుగుతాను చెబుతారా?" అన్నాడు గగన్‌కుమార్!

"అడగండి... తెలిసిందైతే చెబుతాను"

"మీరెవర్నైనా ... ఎప్పుడైనా మోసం చేసార్!..."

"తెలిసి చెయ్యలేదనుకుంటాను."

"తెలియకుండా కూడా చేసుండరు లెండి! అందుకనే ఈ ఇండస్ట్రీలో ఏం జరుగుతున్నాయో మీకు తెలియవు!"

"ఏం... ఎందుకలా అంటున్నారు."

"ఇండస్ట్రీలో పద్ధతులు తెలిసుంటే - మీ ముందు డబ్బు మీరిచ్చుండేవారు కాదు. - ఒకటి... మీ డబ్బుతో మనిద్దరికీ, బిర్యానీ - తీసుకునుండే వారు కాదు... రెండు ఇక మూడు..."

"కుమార్... సారీ గగన్‌కుమార్‌గారూ..."

"ఫర్వాలేదు కుమార్ అనండి! 'గంగులూ' అన్నా అభ్యంతరంలేదు గంగరాజనే నా పేరు - గగనకుమార్‌గా మార్చుకున్నాను. పాండీబజార్లో నామకరణోత్సవం జరిగింది. పేరుపెట్టిన వాళ్ళు, ప్రస్తుతం నా ప్రక్కన తిరగటం లేదనుకోండి... సరే.. మీరేదో చెబుతుంటే అడ్డుపడ్డాను..."

"ఏం లేదు! ఇండస్ట్రీ ఇలాంటిదని అంటానిగ్గానీ!.... ఇండస్ట్రీలో ఉండే వ్యక్తులు, ఇలాంటి వాళ్ళంటానిగ్గానీ మీకు హక్కులేదు..."

"ఎందుకంటారు హక్కులేదని! నేను మోసపోయాను. కాదు - నన్ను మోసం చేసారు! నా పర్సనల్ అనుభవంతో అంటున్నాను, సినిమా ఇండస్ట్రీయే మోసమని..."

"చాలా తప్పు..."

"అంటే నా అనుభవాలు తప్పంటారా?... నేను చెప్పేది అబద్ధం అంటారా?... మీ స్నేహితుడూ, ప్రస్తుత యువదర్శకుడూ మూర్తిగారే అన్నారు! 'యాభైవేలు పెట్టుబడిపెడితే హీరో రోల్ ఇస్తాన'ని. ఇలా, ఇంకా పాండీ బజార్లో ఎంతో మంది... డబ్బిస్తే వేషం ఇస్తామని ఆశ చూపించారు! ఒకతను హీరో వేషం ఇప్పిస్తానని పదివేలు తీసుకుని ఆ మర్నాటి నుండీ కనబడకుండా పోయాడు. భవిష్యత్ తెలుగు తెరకు నాయకుణ్ణి నేనేనని రాసిన ఏ జర్నలిస్టూ ఈ రోజు ఒక్క ముక్క నా గురించి వెయ్యడం లేదు. నన్ను అంతవాడు ఇంత వాడని పొగిడిన పదిమందీ, నా అసలు కథ తెలియగానే.. 'వీడి పనైపోయింది, ఇక మీద లాభం లేద'ని తప్పుకున్నారు! రోడ్డుమీద కనపడ్డా ముఖం చాటేసుకుని పోతున్నారు! ఇండస్ట్రీ ఇంత మోసంగా ఉంటే మోసం లేదంటారు మీరు.... పైగా తప్పు నాదన్నట్టుగా మాట్లాడుతున్నారు.." అని ఉద్రేక పడిపోతూ, సీసాలో మందంతా ఒంపేసుకుని తాగేసాడు.

నేను రెండో హాఫ్ ఓపెన్ చేసాను. "కుమార్‌గారూ - సినీ ఫీల్డ్‌లో మోసం లేదనను! కానీ ఫీల్డంతా మోసం అంటే నే నొప్పుకోను. ఎంత అంది ప్రొడ్యూసర్లు కేవలం ఆర్టిస్టులిచ్చే డబ్బుతో సినిమాలు తీస్తున్నారు. ఎంతమంది డైరక్టర్లు మధ్యవర్తుల ద్వారా వచ్చిన వ్యక్తులకు, నచ్చినా... నచ్చకపోయినా.... వేషాలిస్తున్నారు. ఎంతమంది ఆర్టిస్టులు కేవలం పబ్లిసిటీపైన పైకొచ్చారు?... మీరు మద్రాసులో దిగటం.. దిగటం.... చదరంగంలో పావులా అయిపోయారు! రాంగ్ పీపుల్‌తో కనెక్షన్స్ పెట్టుకుని, ఓవర్ కాన్ఫిడెన్సూ... ఫాల్స్ ప్రెస్టేజీ పెంచుకున్నారేకానీ, మీ టాలెంట్స్‌ని గుర్తించే వ్యక్తుల్ని కలుసుకోలేదని నేనంచనా వెయ్యగలను! మీకు చేయూత నిద్దామని ఎవరన్నా అనుకున్నా ఫాల్స్ ఇమేజ్ పెంచుకోవడం వల్ల, పదిమందీ మీ చుట్టూ చేరి బాకా ఊదడంతో... పెద్ద ఆర్టిస్టుననే ఫీలింగ్ పెంచుకుని... చిన్న వేషాలు మానేసి, ఒకేసారి ఉట్టి దాటేసి స్వర్గాన్నెక్కుదామనుకున్నారు! ఇవన్నీ మీ వ్యక్తిత్వంలోనూ, మీ నిర్ణయాల్లోనూ.... ఉన్న తప్పులు!. దీనికి ఇండస్ట్రీ ఏం బాధ్యత వహిస్తుంది? నేను మద్రాసు వచ్చినపుడు చేతి సంచితో వచ్చాను! నన్నెవరూ మోసం చెయ్యలేదే!"..

"మీరు ఆర్టిస్ట్‌గా వచ్చుంటే తెలుసుండేది"

"మీ ఎస్టిమేషన్ ప్రకారం సినిమా ఇండస్ట్రీ అంతా మోసం! అటువంటప్పుడు ఖచ్చితంగా నేను కూడా మోసపోవాలి, ఇండస్ట్రీలో నేనూ ఒక భాగం కనక"

"గవర్నమెంటులో లంచాలొచ్చే డిపార్టుమెంట్లు కొన్ని ఉన్నట్టే... ఇక్కడ కూడా మోసపోయేవాళ్ళు కొందరే అని చెప్పడానికి నేను చింతిస్తున్నాను రంగబాబుగారూ!"

"అప్పుడే చింతించొద్దు గగన్ కుమార్‌గారూ! ఎవరు చీప్ పబ్లిసిటీ మీద పైకొచ్చారు, ఎవరు డబ్బు పెట్టి పైకొచ్చారు, ఎవరు బాక్‌గ్రౌండ్ మీద పైకొచ్చారూ... వీళ్ళలో ఎవరెవరు టాలెంట్ లేకుండా పైకొచ్చి, ఎన్నెన్నాళ్ళు ఉన్నారు. బేరీజు వేసుకుని, తర్వాత చింతించండి."

గగన్‌కుమార్ ఏదో ఆలోచిస్తూ కొంచెం త్రాగాడు. నేనూ వేసుకున్నాను. నిషా బాగానే ఎక్కింది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అన్నాను, "లాజికల్‌గా నా పాయింట్స్ కరెక్టని ఒప్పించగలనేమో కానీ... మీరు పడ్డ బాధల్ని తప్పని ఒప్పించలేను. ప్రస్తుతం నేను మనఃశ్శాంతి కలిగించలేనేమో ఇక ముందైనా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే మంచిది."

"ఇక తీసుకునే నిర్ణయాలు ఏమున్నాయి! ఇప్పటికే దిగజారిపోయాను. ఈ పరిస్థితుల్లో ఇంకో అడుగువేసే సాహసం కూడా లేదు.. ఊళ్ళో అందరూ హీరో... హీరో అని ములగ చెట్టు ఎక్కిస్తే నిజమేననుకుని, అమ్మా - నాన్నలతో పోట్లాడి, ముప్పైవేలు తీసుకుని, అందమైన కలలు కంటూ ఇక్కడ దిగాను సార్! ఆ డబ్బు అయిపోయేవరకూ నా కలలు అందంగానే ఉన్నాయి. అక్కడి కంటే ఎక్కువగా ఇక్కడా చెట్లు ఎక్కించేవాళ్ళు తగిలారు! ఆఖరి పైసా అయేవరకూ అందరూ చుట్టూ ఉన్నారు. క్రిందటి వారం, డబ్బుకోసం ఆత్మాభిమానం చంపుకుని ఇంటికి ఉత్తరం రాసాను. 'తనమాటకాదని, కాలేజీ ఎగ్గొట్టి వచ్చినందుకు - నా ముఖం చూడనని, తనకీ - నాకూ ఏ సంబంధం లేదనీ' నాన్న ఉత్తరం రాసారు. ఈ విషయం తెలిసిన తర్వాత చుట్టూ ఉన్నవాళ్ళు, ఒక్కొక్కరూ పారిపోయారు! నా డబ్బు తిన్నవాళ్ళలో ఒక్కడు కూడా పైసా సాయం చెయ్యడానికి, ముందుకు రాకపోగా... 'కొవ్వెక్కి డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టుకున్నాడు, వాడి ముఖం వాడు, అద్దంలో చూసుకోకుండా సర్కారెక్కి వచ్చాడు. పాపం' అని కామెంట్లు మొదలుపెట్టారు. నేను చాలా ఆశ్చర్యపోయాను! ఏం లాభం... ఇప్పుడు నేను చేయగలిగింది ఏమీ లేదు.....మనసులో బాధ చెప్పుకుందామన్నా, ఒక్క స్నేహితుడు లేడు! పనిలేదు...ఒంటరితనం! ఈ బాధ భరించలేకపోతున్నాను సార్! చక్కని ఫామిలీని, ఫ్రెండ్స్‌ని విడిచిపెట్టి వచ్చి, ఏకాకినైపోయాను. అటు పోలేను. ఇక్కడ ఉండలేను. జీవితం చేతులారా నాశనం చేసుకున్నాను సార్!"....

అని మోకాళ్ళలో తలపెట్టుకుని.... కూర్చుండిపోయాడు! నా మనసంతా జాలితో నిండిపోయింది. నేను మాత్రం ఏం చేయగలను!

"ఊరుకోండి గగన్‌కుమార్‌బాధపడకండి" అని భుజం మీద చెయ్యివేసాను.

గగన్‌కుమార్ తలెత్తి, చిన్నగా నవ్వి, "ఏడుస్తున్నాననుకున్నరా సార్! ప్రస్తుతం ఏడ్చే ఓపిక్కూడా లేదు. మీ దగ్గర అన్నీ చెప్పేసాక మనసు చాలా తేలిక పడింది. ... ఇంత సేపు బోర్ కొట్టించాను కదు!"

'నొ, నో. నాకేం బోర్ లేదు పైగా నాకూ పనిలేదు" అన్నను.

"ఉంటాను సార్"

"ఓకే, అప్పుడప్పుడూ వస్తూవుండండి"

"థాంక్యూ సర్! గుడ్‌నైట్"

"గుడ్‌నైట్"

తడబడుతూ మెట్లు దిగి వెళ్ళిపోయాడు గగన్ కుమార్. గాలికి ఎంగిలాకులు రెపరెపలాడుతున్నాయి. ఖాళీగ్లాసులు, ఖాళీసీసాలు, సిగరెట్టు ముక్కలు - చిందర వందరగా పడిఉన్నాయి. రూము శుభ్రం చెయ్యాలని పించలేదు. మత్తు మెల్లిగా ఎక్కుతోంది. చాపమీద పరుపు పరచి పడుకున్నాను. మత్తుగా ఉంది కానీ, నిద్రపట్టటం లెదు. వంటినిండా వేడి సెగలు కక్కుతుంది. నరాలు జివ్వుమంటున్నాయి.

ఎవరన్నా అమ్మాయి దగ్గరకు వెడితే బావుండు. ఆలోచన రాగానే, తటాలున లేచి బట్టలు వేసుకుని, రూమ్‌లాక్ చేసి రోడ్డు మీద పడ్డాను! అడుగులు విపరీతంగా తడబడుతున్నాయి. థియేటర్ దగ్గరకొచ్చి ఆటో ఎక్కి రజని ఇంటి ముందు దిగాను. లోపల ఎర్రబల్బ్ వెలుగుతుంది. తలుపు తట్టి, గోడకు ఆనుకుని నిలబడ్డాను. అయిదు నిమిషాల తరువాత తలుపు తెరచుకుని, వళ్ళు విరుచుకుంటూ రజని బయటకొచ్చింది.

"ఎవరూ"

........

"ఏవరం.... అరే మీరా రంగ బాబుగారూ!నమస్కారం సార్"

"న...మ...స్తే"

"లోపలికి రండి" అంటూ బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళి మంచం మీద కూర్చోబెట్టి, పక్కనే తనూ కూర్చుని, "దారి తప్పి వచ్చారు" అంది.

"దారి తెలిసే వచ్చాను"

నవ్వి "ఇంతకుముందు, ఎన్ని సార్లు పిలిచినా రాలేదు. ఈరోజు పిలవకుండానే వచ్చారు. మా అదృష్టమా, దురదృష్టమా"

"నా ఖర్మ"

"అయ్యో పాపం! ఇంతకీ, ఇక్కడికి రావడంలో విశేషం ఏమిటి?"

"ఒక అబ్బాయి - ఒక అమ్మాయి దగ్గరకు, అందులో నీ దగ్గరకు ఇంత రాత్రి ఎందుకొస్తాడు"

"అందుకొచ్చారా! సరే నే పిలిచినపుడు మీరు రాలేదు కదూ!"

"అవును"

"ఇప్పుడు మీకై మీరే వచ్చారుగా"

"నిజమే"

"అందుకని, ఈ రాత్రి మీతో ఉన్నందుకు రెండొందొందలు! అదీ మీకు గనక కన్సెషన్"

"అయితే వస్తాను" అని లేచాను.

"అదేంటి సార్"

"ఇప్పటికే సగం రాత్రి గడిచిపోయింది! సగం రాత్రికి రెండొందలా !"

"సరే రెండొందల్ని సగం చేసి, వందివ్వండి"

"అలాగే! ఆ వందకూడా ఇప్పుడివ్వను! ఒక ఐడియా చెబుతా నువ్వే కలెక్ట్ చేసుకో"

"చెప్పండి."

"పాతవేలు రామయ్యగారు, పాత పిక్చర్లో నాకు రెండు వేలు బాలన్సు ఇవ్వాలి అది వసూలు చేసుకో"

"భలే కాతా చెప్పారు సార్!" ఆ పిక్చర్లో వేషం వేసినందుకు నాకూ ఆయన ఇవ్వాలి.

"అదే! నా ఎమౌంట్ - నీ ఎమౌంట్ రెండూ వసూలు చేసుకో! రెండు వేలిచ్చినా, రెండూ వందలిచ్చినా, రెండు రూపాయలిచ్చినా, మొత్తం నీదే"

"ఆయనివ్వటం అటుంచి, మన్ని అడక్కుండా ఉంటే అంతే చాలు ఆయనొకసారి నన్ను హోటల్ రూమ్‌కి తీసుకెళ్ళి, రాత్రంతా ఉంచుకుని ఇంకా ఇద్దరు ఫ్రెండ్స్ రూమ్స్‌కి పంపి, ఉదయాన ఆటో డబ్బులు కూడా ఇవ్వకుండా పంపారు. అఫ్‌కోర్స్ - వేషం ఇచ్చారనుకోండి."

"గుడ్"

"ఏమిటి గుడ్డు!"

"ఆ పిక్చర్‌లో నీ డొనేషన్ కూడా ఉందన్నమాట"

రజని చిలిపిగా నవ్వి, "ఇలాగే కూర్చుని కబుర్లు చెబుతారా"

"నువ్వు రేటింకా ఫిక్స్ చేయలేదు"

"నా రేటు హీరోయిన్ కేరెక్టర్‌తో సమానం , అంతే  ఇస్తారా!"

"నా పిక్చర్‌లో హీరోయిన్‌కి నువ్ సూటబుల్ అనుకుంటే - తప్పకుండా ఇస్తాను."

మందు బాగానే కొట్టారనుకుంటానే"

"అందుకనే నీ దగ్గరకొచ్చాను"

"లేకపోతే రారా"

"రాను"

"ఏం...పాపం"

.............

"ఎవరైనా ప్రేమించిన అమ్మాయుందా!"

"ఊం..."

"ఆ అమ్మాయి మిమ్మల్ని రానివ్వడం లేదా!"

"అదేం కాదు"

"చెప్పండి బాబూ!" గోముగా అని గుండెలమీంచి లేచింది.

"ఏవుంది చెప్పడానికి"

"జాకెట్టు తీస్తే నేను బావున్నానా... ఆం.. అమ్మాయా!"

"ఛ! అంత ఛండాలంగా మాట్లాడకు"

"ఏం... సార్! ప్రేమిచుకున్నోళ్ళు ముందు చేసే పనేగా ఇది."

"ఆ అమ్మాయిని అలా ఊహించుకోవడం లేదు"

"పెళ్ళయిన తర్వాత కూడా..."

"ప్రస్తుతం పెళ్ళి కాలేదుగా"

..............

..............

"మీరు చాలా మంచి వాళ్ళు"

"అలాగా"

"అవును! మిమ్మల్ని ప్రేమించిన అమ్మాయి చాలా అదృష్టవంతురాలు"

"ఎందుకో"

"ఆ అమ్మాయిని మీరు కల్లో కూడా మోసం చెయ్యరు"

"మందులో మోసం చేస్తాను కదూ"

"ఏ...."

"మరి నీ దగ్గరకు రావడం, ఆ అమ్మాయిని మోసం చేసినట్లేగా"

"ఇది మనకి మామూలేగా సార్!... మీరేదో పురాణ పురుషుల్లా మాట్లాడుతున్నారు..."

"సరే! నువ్వు లెగు".... అన్నాను.

"అబ్బా! తొందర" అని లేచి లంగా బొందు విప్పబోయింది.

"విప్పకు రజనీ" అన్నాను.

రజని ఆశ్చర్యంగా చూస్తుంది. నేను మంచం దిగి చెప్పులు వేసుకున్నాను.

"వెళ్ళిపోతున్నారా"

"ఆc.."

"ఇంత రాత్రి వచ్చి, నా నిద్ర పాడు చేసి, ఏం చేయకుండా వెళ్ళిపోతే నేనూరుకుంటానా!"

"సారీ రజనీ! ఏదో ఉద్రేకంలో వచ్చాను. ఇదిగో నువ్వడిగిన రెండొందలు."

"డబ్బు నాకెందుకు సార్! మీకు నేనేమిచ్చానని తీసుకుంటాను"

"నిన్ననవసరంగా చికాకు పెట్టాను! ఉంచుకో"

"అవసరం లేదు రంగబాబుగారు! నాక్కావలసింది ఇవ్వగలిగితే ఇవ్వండి" అంది, నా ఎదురుగా నిలబడి.

డబ్బు బెడ్ మీదుంచి, మాట్లాడకుండా, ముందు రూమ్‌లో కొచ్చాను. రజని పరిగెత్తుకుంటూ వచ్చి, డబ్బు జేబులో పెట్టి "వెళ్ళండి" అంది.

వెనక్కి తిరిగి చూడకుండా తూలుకుంటూ రోడ్డు మీద అడుగు పెట్టాను. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. అప్పుడప్పుడు కుక్కలు మొరుగుతున్నాయి. రజనిని - ఏ విధంగానన్నా బాధ పెట్టానా? పెట్టి ఉంటాను! అంతలో జయ ముఖం నవ్వుతూ నా కళ్ళముందు మెదిలింది. మనసు చాలా తేలిక పడింది. తాత్కాలికమైన ఉద్రేకంలో నేను తప్పు చెయ్యలేదు. ఈ వయస్సులో అమ్మాయిలతో తిరగడం కొంతమంది ఉద్దేశ్యంలో తప్పుకాకపోవచ్చు. ఎవరి ఉద్దేశాలు వాళ్ళకుంటాయి. నా ఉద్దేశంలో నేను తప్పు చేయలేదు.

✡✡✡

నేను గేటు తెరిచి లోపలికి అడుగు పెడుతుంటే, పాలవాడు పాలు పోసి వెళుతున్నాడు. పాలగిన్నె లోపలకు తీసుకువెళుతున్న మా ఇల్లు గల వాళ్ళమ్మాయి ఆగి, "రాత్రంగా ఎక్కడ తిరిగొచ్చారు" అని అడిగింది.

నేనేం సమాధానం చెప్పలేదు.

"తప్పుకదూ" అంది.

నోరు తెరిచి సమాధానం చెప్పేలోగా లోపలికి వెళ్ళిపోయింది. నా బుర్రకేం ఎక్కలేదు. అచేతనంగా మెట్లెక్కి రూమ్‌లో కొచ్చి పక్కమీద పడ్డాను. వెంటనే నిద్రపట్టేసింది.

✡✡✡

తలుపులు దబదబ మోగుతుంటే, బద్ధకంగా లేచి తలుపు తీసాను! డైరెక్టర్ శంకరంగారు!...

"రండి సార్.. రండి.. కూర్చోండి" అన్నాను.

ఆయన రూమంతా చూసి, "రాత్రి పార్టీ బాగానే జరిగినట్టుందే" అన్నారు.

"సారీ సర్"

'భలేవాడివి! నేనేమన్నా మడికట్టుక్కూర్చున్నానా!" అన్నారు.

గబగబా ఆకులు, ఖాళీ సీసాలు తీసి డస్ట్ బిన్‌లో పడేసి, "ఛైర్స్ లేవు సార్! ఈ బెడ్‌నే మీరు అన్నీ అనుకోవాలి" అన్నాను.

"కనీసం బెడ్ అయినా కొన్నావు! ఇది మాత్రం అమ్మకేం" అని గట్టిగా నవ్వారు.

నేను నవ్వాను.

"నువ్వు కూర్చో" అని ప్రక్కకి జరిగారు. ప్రక్కనే కూర్చున్నాను.

"ఏమన్నా పిక్చర్లు ఒప్పుకున్నావా రంగబాబు' అని అడిగారు.

"లేదు సార్! ప్రస్తుతం ఖాళీ"

"వచ్చే నెలనుండీ మన పిక్చర్ స్టార్ట్ కాబోతుంది! కొత్త పార్టీ మంచి ఎమౌంట్ ఇప్పిస్తాను. నీకేమన్నా అభ్యంతరమా?"....

"అభ్యంతరం ఏంటి సార్! మీరు గురువులాంటివారు! ఎవరితోనన్నా కబురు చేస్తే నేనే మీ దగ్గరకొచ్చేవాణ్ణి" అన్నాను.

"నువ్వేం మారలేదు రంగబాబూ! అప్పుడెలా ఉన్నావో ఇప్పుడూ అలాగే ఉన్నావు"

"అవును సార్! నా పొజిషన్ కూడా ఏమీ మారలేదు. అప్పుడూ క్రిందే పడుకునేవాణ్ణి, ఇప్పుడూ క్రిందే పడుకుంటున్నాను. అయితే అప్పుడు చాపమీద పడుకుంటే ఇప్పుడు బెడ్‌మీద పడుకుంటున్నాను."

"నీలాంటి టాలెంటెడ్‌కి గుర్తింపు లేదు రంగబాబు! దీనికి కారణం గుర్తించావా!"

"లేదు సార్"

"నువ్వు ఏ బిజీ డైరెక్టర్ గ్రూప్‌లోనో ఉంటే నీకు పిక్చర్ తర్వాత పిక్చర్ ఉండేది! నువ్వు పెద్ద డైరెక్టర్లందరి దగ్గరా పనిచేసావు! అన్ని గ్రూపులనుండీ బయటికొచ్చావు. దీనివల్ల కష్టాలొక్కటే మిగుల్చుకున్నావు."

"కష్టాలు పడ్డా నా వ్యక్తిత్వం కోల్పోలేదని చాలా సంతృప్తిగా ఉందిసార్"

.............

"డైరెక్టర్ మొదటి పిక్చర్లో తన అసిస్టెంట్స్‌తో ఎంత ఫ్రీగా ఉంటాడో - అంత ఫ్రీగా బిజీ అయిన తర్వాత కూడా ఉంటున్నాడా సార్"....

"అది వ్యక్తుల మీద ఆధారపడి ఉంటుంది రంగబాబు!"

"అందుకే నా భావాలక్కూడా విలువిచ్చే వ్యక్తి దగ్గర పనిచెయ్యడం నాకిష్టం సార్! ఆ డైరెక్టర్ బిజీ డైరెక్టర్ కాకపోయినా ఫర్వాలేదు. తను సంవత్సరానికి ఒక్క పిక్చరే చెయ్యొచ్చు"

..................

"ఈ రోజు మీరు నా రూముకి రావాల్సిన అవసరంలేదు. అయినా ఏ ఫీలింగ్ లేకుండా............"

"నేను ప్రస్తుతం బిజీ డైరెక్టర్ని కాదుగా!"

"మీరు బిజీ అయినా మారరు సార్! మీరు వ్యక్తిత్వం ఉన్న మనుషులు - ఎదుటివాడి వ్యక్తిత్వపు విలువలు తెలుసు."

"సర్లే, రంగబాబూ - అవన్నీ ఇప్పుడెందుకు"

"నేనేదో కాకా పడుతున్నానని అనుకోవద్దు సార్! ఉన్న నిజం చెప్పాను. మొదటినుంచీ మీరంటే నా కెంతో అభిమానం! మీరు అసోసియేట్‌గా ఉన్నప్పుడు - అప్రెంటీస్‌గా చేరాను. నన్ను ఆదరంగా దగ్గరకు తీసుకుని, ఆప్యాయంగా ఎన్నో నేర్పారు. మీ దగ్గరే నేను అసిస్టెంట్ అయాను. మీరు డైరెక్టరు అయినప్పుడూ, మొదటిసారిగా మీ దగ్గరే అసోసియేట్‌గా చేసాను. బస్ చార్జీలకి మీ దగ్గర డబ్బు తీసుకున్న రోజులు నేనింకా మరచిపోలేదు సార్! మీరిచ్చిన చొరవ వల్లే టెక్నిక్ తెలుసుకుని, నేనెక్కువ పిక్చర్లు చెయ్యకపోయినా, ఫీల్డులో నా స్థానం పోగొట్టుకోకుండా నిలబడ్డాను. మీ గురించి మీ దగ్గర చెప్పకూడదు! బయట బాజా వాయించాలంటే నాకున్న స్నేహితులు బహు తక్కువ! మీలో ఇంత కెపాసిటీ ఉండి... ఫీల్డ్‌లో ఉంటూ కూడా ఎక్కడో దూరతీరాల్లో ఉంటున్నట్టు"... ఆ తర్వాత నాకెందుకో మాట పెగల్లేదు.

శంకరం గారు నా ముఖంలోకి తదేకంగా చూసి, చిరునవ్వు నవ్వి, భుజం నిమురుతూ, " నాగురించి ఎందుకంత ఎగ్జైట్ అవుతావు రంగబాబు! ఏ మనిషి కన్నా అవకాశం తలుపు తడుతట్టడమే కాదు. కాలు లోపల పెట్టాలి! ఆనాడే విలువలు తెలుస్తాయి. ఒకనాడు ఎన్నో ఆశయాలు గుండెలనిండా నింపుకుని, సాంఘిక సమస్యల మీద సినిమాలు తీస్తూ - కొత్తదనం ప్రజలకి అందివ్వాలనే తపనతో వచ్చాను. తపన, తపనగానే ఉండిపోయింది. సందేశాల స్థానంలో - జీవితం మీదే సందేహం కలగడం మొదలైంది! అయినా చావని తపన మూలంగా, క్రింద పడుతున్నా - తిరిగి లేచి నిలబడ్డానికి, ప్రయత్నిస్తూనే ఉన్నా! సరైన అవకాశం రాకపోయినా, దేవుడి దయవల్ల కుటుంబం భోజనానికి లోటులేకుండా జరిగిపోతోంది ప్రస్తుతం, అది మాత్రం ఒక వరం కాదంటారా?...

గొంతు పెగుల్చుకుని "మీ ఇన్నాళ్ళ అనుభవంలో ఆ సంతృప్తి ఒక్కటి చాలంటారా?"... అన్నాను.

"చాలదు! ఒక మంచి సక్సెస్‌ఫుల్ పిక్చర్ ఇవ్వాలనే నా కోరిక. తీరిన నాడే నిజమైన సంతృప్తి! కానీ, ఆ కోరిక ఎప్పుడు తీరుతుందో తెలియక - మంచి డైరెక్టర్‌గా నిలబడాలనే కోరికతో ఎంతమంది కుటుంబాల్ని నాశనం చేసుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో, కనీసం నా కుటుంబాన్ని పోషించుకోగలుగుతున్నారు అనే ఆనందం పొందుతున్నాను. మామూలు మానవుడిగా ఆలోచిస్తే, ఇది మాత్రం సంతృప్తి కాదంటావా?"

నేనేం మాట్లాడలేక బెడ్‌మీద గీతలు గీస్తున్నాను. శంకరంగారు లేచి నిలబడి "చాలా రోజుల తరువాత నా శిష్యుడితో మనస్ఫూర్తిగా మాట్లాడాను. చాలా సంతోషంగా ఉంది రంగబాబూ! ఇక నేను వెడతాను. రేపొకసారి ఇంటికిరా! ఇద్దరం కలిసి ఆఫీసుకు వెడదాం! మనస్టోరీ చెబుతాను! వస్తాను"

"నేనూ రోడ్డు వరకు వస్తాను సార్" అని చెప్పులు వేసుకుని ఆయన వెనకే బయలుదేరాను.

శంకరంగారు టాక్సీలో కూర్చున్న తర్వాత "ఈ వారంలో అడ్వాన్స్ ఇప్పిస్తానన్నారు".

"ఫర్లేదు సార్! దాందేముంది" అన్నాను.

ఆయన చిరునవ్వు నవ్వి, డ్రైవర్‌కి సైగ చేసారు. టాక్సీ కదిలి, ట్రాఫిక్‌లో కలిసిపోయింది.

శంకరంగారి షూటింగ్ మొదలైంది. శంకరంగారితో ఎటువంటి ప్రాబ్లమ్ లేదు. స్టోరీ - డైలాగ్స్‌లో మొత్తం స్క్రిప్ట్ - షూటింగ్‌కు ముందే తయారై రెడీగా ఉంటుంది. రేపటి సీన్లు ఈ రోజే షాట్ డివిజన్ చేసి నా చేతికిస్తారు. సింగిల్ లైన్ ఆర్డరు మూడు కాపీలు తీయించి, తన దగ్గరొకటి పెట్టుకుని, నా కొకటి, అసిస్టెంట్ డైరెక్టర్ కొకటి ఇస్తారు. మర్నాడు తీయబోయే సీన్స్ డైరెక్టర్‌గారి తో డిస్కస్ చేసి, అసిస్టెంట్ డైరెక్టర్‌తో చెప్పగానే, అసిస్టెంట్ డైరెక్టర్ - ఆర్టిస్టుల లిస్టు తయారుచేసి, డ్రెస్ కంటిన్యుటీలు చెక్ చేసి, సెట్ ప్రాపర్టీ

లిస్టు రాసి ప్రొడక్షన్, మేకప్, కాస్ట్యూమ్స్, సెట్ అసిస్టెంట్స్‌కి అందజేస్తాడు. మర్నాడు షూటింగు చాలా ప్రశాంతంగా జరిగిపోతుంది. షూటింగ్ బోర్‌గా జరుగుతుందనుకున్న సమయంలో, శంకరంగారు టపీమని ఒక విట్టు వేస్తారు. దాంతో సెట్టంతా పదినిమిషాలు గొల్లుమంటుంది. తర్వాత మళ్ళీ వర్కులోకి జారిపోతాం! నిజంగా 9.00 టు 9.00 కాల్‌షీటు ఇంత త్వరగా అయిపోయిందా అనిపిస్తుంది.

మొదట షెడ్యూల్ ఇన్‌డోర్ చాలా చక్కగా జరిగింది. ఎడిటెడ్ రష్ మూడు రీళ్ళు వచ్చింది. రెండో షెడ్యూల్ అరకులోయ అవుట్‌డోర్! హీరో అనంతకుమార్ కాల్‌షీట్లు మాట్లాడ్డానికి, వాహినీ స్టూడియోకి వెళ్ళాను. షూటింగ్ చాలా జోరుగా జరుగుతోంది. డ్రమెటిక్ సీన్ అనుకుంటాను. అందరూ మూడ్‌లో ఉన్నారు. ఇప్పుడు డిస్టర్బ్ చేయడం కంటే లంచ్ బ్రేక్‌లో మాట్లాడ్డం మంచిది బయటకు రాబోతూ ఆగాను. ఒక మూల నిలబడి, గగన్‌కుమార్ క్లాప్ తుడిచి, అసిస్టెంట్ డైరెక్టర్ చెప్పిన నంబరు క్లాప్ పై రాసి, క్లాప్ అందిస్తున్నాడు. అంతలో అసోసియేట్ డైరెక్టర్ - గగన్‌కుమార్‌తో, "ఏయ్! ఆ మూలేం చేస్తున్నావు. ఆ బల్లలు సెట్‌బాయ్ ఒక్కడూ మోయలేక ఛస్తున్నాడు, సాయి చెయ్యి" అని అరిచాడు.

గగన్ కుమార్ కంగారు పడుతూ బల్ల దగ్గరకెళ్ళాడు. నేను బయటకొచ్చాను. షూటింగ్ లేని ఆర్టిస్టులు కొంత మంది బయట సిగరెట్లు కాలుస్తూ బాతాఖానీ కొడుతున్నారు. నేను రాగానే తెలిసిన ఆర్టిస్టులు విష్ చేసి, మా పిక్చర్లో ఏమన్నా కేరక్టర్లుఇమ్మని అడగటం మొదలు పెట్టారు. వాళ్ళతో మాట్లాడుతుండగానే లంచ్ బ్రేక్ అనౌన్స్ చేసారు. అనంతకుమార్ ఠీవిగా బయటకొచ్చాడు. మాకు పదిహేనో తేదీనుండీ హీరోయిన్ కాల్‌షీట్లు ఇచ్చింది! హీరోయిన్ కాల్‌షీట్లు ఇచ్చింది - మీరు ఇవ్వండంటే ఇవ్వక పోవచ్చు.

"గుడ్ మార్నింగ్ సర్" అన్నాను.

"గుడ్‌మార్నింగ్!..... ఇలా వచ్చావేంటి రంగబాబూ."

"ఈ నెల్లో అవుడ్‌డోర్ షూటింగ్ పెట్టుకోవాలనుకుంటున్నాం! మీరెప్పుడు ఫ్రీనో కనుక్కోడదామని"

"మీ ప్రొడక్షన్ మేనేజరేమయ్యాడు"

"డైరెక్టరు గారు నన్ను వెళ్ళమన్నారు"

"నా డైరీ సెక్రటరీ దగ్గరుంది! చూసి చెబుతాను మీరు ఎప్పటినుంచీ పెట్టుకోవాలనుకుంటున్నారు"

"మీరెప్పుడంటే అప్పుడే!... డైరెక్టరుగారు మాత్రం ఈ నెల పదిహేను నుండీ పెట్టుకుందామని అనుకుంటున్నారు! మీకు వీలైతే..."

"పదిహేను! చూస్తాను. - మీ మేనేజర్నొకసారి నా దగ్గరకు పంపించు"

"అలాగే సార్! వస్తాను"

"ఓ.కె" అని వెళ్ళిపోయాడు.

నేను కారు దగ్గరకొచ్చేసరికి, అక్కడ గగన్‌కుమార్ ఉన్నాడు.

"గుడ్‌మార్నింగ్ సర్" అన్నాడు.

"గుడ్ మార్నింగ్! ఈ పిక్చర్లో అప్రంటీస్‌గా చేస్తున్నారా?"

"అవును సార్"

"ప్రొఫెషన్ తమాషాగా మార్చారే"

"బ్రతకాలిగా సార్! అయినా వేషాలు వెయ్యడం మానలేదు సార్! మీకు వీలైతే చిన్న వేషమైనా, మీ పిక్చర్లో ఇప్పించండి సార్!....

"సరే! ఏమైనా ఉంటే చూసి కబురు చేస్తాను."

"థాంక్యూ సర్!"

"మరి ఉంటాను"

"అలాగే సార్" అన్నాడు.

కారు కదిలింది.

✡✡✡

అనంత కుమార్ పదిహేనువేలు అర్జంటుగా కావాలన్నాడంట, మా ప్రొడక్షన్ మేనేజరుతో! ఫైనాన్స్ ఎరేంజ్‌మెంట్ కాలేదు. పదుహేనో తారీకు పోయిందంటే, మా హీరోయిన్ వచ్చే నెలవరకూ ఖాళీ లేదు. ఆలస్యం అయిన కొలదీ ప్రొడక్షన్ కాస్ట్ పెరిగిపోతుంది. శంకరంగారు శ్రమ మీద అయిదువేలు అప్పు సంపాదించి, అనంత కుమార్‌కి ఇచ్చి కాల్‌షీట్లు అడిగారు. డైరెక్టర్ గారే స్వయంగా వెళ్ళడం వల్ల కాదనలేక "రెండురోజులు అడ్జస్టు చేస్తాను! లోకల్ షూటింగ్ పెట్టుకోండి వస్తాను" అన్నాడంట.

వెంటనే అరుణాచలం స్టూడియోలో కాల్‌షీట్లు తీసుకుని, 'హీరోయిన్ ఇల్లు' సెట్ వేసి షూటింగ్ మొదలు పెట్టాం. ఆ సెట్లో గగన్‌కుమార్‌కి ఒక నౌకరు కేరక్టర్ ఇప్పించాను. ఒకే డైలాగ్ ఆరు టేకులు తిన్నాడు ఎన్నో రకాలుగా చికాకుల్లో వున్న డైరెక్టరుగారు, గగన్ కుమార్‌ని తిట్టి, వేరే ఆర్టిస్టుని అప్పటికప్పుడు పిలిపించి, డైలాగ్స్ ఆ మనిషికిప్పించి, డైలాగ్స్ లేకుండా ఆ ఇంటిలో ఉండే మరో నౌకరు కేరక్టర్ గగన్‌కుమార్ కిచ్చారు. గగన్‌కుమార్ డీలా పడిపోయాడు.

"డిస్కరేజ్ అవకండి! ప్రతి ఆర్టిస్టు జీవితంలో మొదటి అనుభవం ఇలాగే ఉంటుంది" అన్నాను.

గగన్‌కుమార్ చాలా నిరాశగా నవ్వాడు. రెండురోజులు అతని వేషానికి, అప్పటికప్పుడు డబ్బులిప్పించి "మరలా ఏదన్నా ఉంటే కబురు చేస్తాను! బాధ పడకండి" అని మరోమారు చెప్పి పంపేశాను.

****✡✡✡

మూర్తి డైరెక్ట్ చేసిన పిక్చర్ సూపర్ హిట్టయింది. ఇప్పుడు మూర్తి పెద్ద డైరెక్టర్! తన రూమ్ మార్చేసి, ఫ్లాట్ - హౌసెస్‌లో ఒక ఫ్లాటు తీసుకున్నాడు. ఒకరోజు వాహిని స్టూడియోలో ఎడిటింగ్ రూమ్స్‌కి వెడుతుంటే, మూర్తి వస్తున్నాడు.

"హల్లో! మూర్తి" అన్నాను.

ముఖం మాడ్చుకుని "హల్లో" అన్నాడు.

"కంగ్రాజ్యులేషన్స్ రా! పిక్చర్ సూపర్ హిట్ చేసావు" అన్నాను.

"థాంక్స్" అని గబగబా వెళ్ళిపోయాడు. నిశ్చేష్టుణ్ణై, అలాగే నిలబడిపోయాను.

ఎడిటింగ్ అసిస్టెంట్ మాధవ్ వచ్చి "మూర్తి ఇప్పుడు పెద్ద డైరెక్టర్. ఇంకా 'ఏరా' అంటే ఎలా" అన్నాడు.

"అవును! మూర్తి కూడా మారతాడనుకోలేదు. లేకపోతే డైరెక్టరు కనుక నమస్కారం పెట్టుండేవాణ్ణి" అన్నాను.

"ఓ.కే. మన రూమ్‌కి పోదాం! ఎడిటింగ్ రష్ చూద్దువుగాని" అన్నాడు మాధవ్.

మూవియోలో మీద పిక్చర్ 'రన్' అవుతుంది. ఆ పిక్చర్ ప్రతిఫ్రేమ్ మీద మాడ్చుకున్న మూర్తి మొహమే సూపర్ ఇంపోజ్ అయి, కనబడుతోంది.

****✡✡✡

శంకరంగారి పిక్చరు ఆగిపోయింది. ఆగిపోయి కూడా మూడు నెలలవుతోంది. నేను బిజీ అసోసియేట్‌ని కాకపోవడం వల్ల బ్యాంక్ ఎక్కౌంట్ లేదు. పిక్చరుండగా మిగిల్చిన డబ్బు రెండునెలల్లో అయిపోయింది. వాచీ తాకట్టుపెట్టి, ఆ డబ్బుతో ఇంటి అద్దె కట్టేశాను! అప్పులు లేకపోవడం వల్ల, తిన్నా - తినక పోయినా సంతోషమే! భోజనం గురించి, అందులో - రేపటి గురించి ఆలోచించేటంతటి బ్రెయిన్ నాకు లేకపోవడం వల్ల ఆలోచనలు లేవు! మధ్యాహ్నం భోజనం చేసివచ్చి, పడుకున్నాను. వెంటనే నిద్రపట్టింది.

లేచేసరికి టైం ఎంతయిందో తెలీదు. చాలానే అయి ఉంటుంది. ఇంత అకస్మాత్తుగా మెలుకువ ఎలా వచ్చిందని కళ్ళు తెరవకుండానే ఆలోచించడం మొదలుపెట్టాను. అంతలో నుదురు మీద వెచ్చని శ్వాస తగిలింది. దాంతోపాటు రెండు పల్చని పెదాలు నుదురు సున్నితంగా ముద్దు పెట్టుకుంటున్నాయి. కళ్ళు తెరవకుండానే చేత్తో ఆ తలపట్టుకున్నాను. తలపైకి లేచింది. మెడచుట్టూ రెండు జడలు. నా చేయి క్రిందకు దించాను. మెడ, మెడలో సన్నని డాలర్ చెయిన్. ఆ చేతిని అలాగే క్రిందకు పోనిచ్చాను. గుండెలమీద రెండు ఎత్తులు, అక్కడ తడిమాను, "ఛ" అని చెయ్యి విదిలించుకుంది.

కళ్ళు తెరిచాను. నా తల దగ్గర జయ! కిలకిలా నవ్వుతూ "ఏంటి బాబు నువ్వు" అంది.

వెంటనే లేచి కూర్చుని "ఎంతసేపయింది జయా, నువ్వొచ్చి" అన్నాను.

"చా...లా....సేపయింది! అవునూ దేవదాసులా గెడ్డం పెంచేశావేఁ! "

"ఈ మధ్య జయ దయలేదుగా! అందుకని"

"ఆహా..." అని నన్ను పరిశీలనగా చూసి "కొంచెం చిక్కావుకూడా" అంది బాధగా!

"రేషనింగ్! చేస్తున్న పిక్చర్ ఆగిపోయిందిగా!" అన్నాను!

జయ ఆపుకుందామని ప్రయత్నించినా, గట్టి నిట్టూర్పు బయటకు వచ్చింది.

"నువ్వు..."

"ఉపన్యాసం ఇవ్వకు జయా! నాకు చికాకు" అన్నాను.!

జయ లేచి షేవింగ్ సెట్టు, అద్దం పట్టుకొచ్చి ముందు పెట్టి "షేవ్ చేసుకో" అంది.

"ఎందుకూ"

"ఎందుకేంటి! నీ ముఖం అద్దంలో చూసుకున్నావా?"

"ఆఁ! చాలా అందంగా ఉన్నానని రోజూ అనుకుంటున్నాను."

"నిజమే అందమైన పిచ్చోళ్ళా ఉన్నావు"

"ఈ పిచ్చోడితో తిరుగుతున్నావు కనుక - నువ్వూ పిచ్చిదానివే"

"రోజూ నీ గురించి ఆలోచిస్తూ, నేనెప్పుడో పిచ్చిదాన్నయిపోయాను!.... సరే... నువ్వు షేవింగ్ చేసుకోవా" అంది.

"బద్ధకంగా ఉంది జయా" అన్నాను.

జయ ఎదురుగా కూర్చుని, క్రీమ్ గడ్డానికి రాసి, బ్రష్ చేసి, రేజర్‌లో బ్లేడ్‌ని బిగించి చేతికిచ్చింది, జయ అలాగే చూస్తుంటే.............

"ఏంటి.... అలా చూస్తావ్" అంది మురిపెంగా!

"నువ్విలా చేస్తుంటే నాకెలా అనిపిస్తుందో తెలుసా"

తెలియదని అడ్డంగా తలూపింది.

"మనిద్దరం కాపురం మొదలుపెట్టి చాలారోజులయినట్టూ"....

"ఊc..."

"మన పిల్లలు, మనిద్దర్నీ విడిచి ఆడుకుంటానికి వెళ్ళినట్టుంది."

"!c..."

"ఇంత మంచి - అందమైన అమ్మాయి, నన్ను ఎంతో అమాయకంగా, ప్రేమిస్తుందీ, ఆ అమ్మాయి తన వాళ్ళను వదులుకుని, నాకోసం వస్తే, నేను సుఖపెట్టగలనా? తను ఈ ఒడిదుడుకులు తట్టుకోగలదా??.... ఈ రేషనింగులూ..... అవీ...."

"ప్లీజ్... రంగా!" భుజం చుట్టూ చెయ్యి వేసి, నాకళ్ళలోకి చూస్తూ "ఇంక మాట్లాడకు!అని భరించలేను" అంది.

గడ్డానికి రాసిన క్రీము ఎండిపోయింది. మరలా బ్రష్ చేసి షేవింగ్ మొదలుపెట్టాను! జయ కళ్ళార్పకుండా చూస్తుంది.

"ఒక్క నిముషంలో స్నానం చేసి వస్తాను" అని క్రిందకు వచ్చాను.

గబగబా స్నానం చేసి పైకెళ్ళేసరికి, జయ బ్లాక్‌ఫాంటు, వైట్, బ్లూ కలర్ ఫుల్ హాండ్స్ షర్ట్ తీసి, బెడ్ మీద పెట్టింది. అవంటే జయకు చాలా ఇష్టం.

చాలారోజుల తర్వాత 'టక్' చేసాను. బూట్లు తొడుక్కుని, అద్దంలో తల దువ్వుకుని, జయవేపు తిరిగాను.....

"నీ మొహంలో ఏదైనా మార్పు కనిపించిందా" అంది జయ!

"లేదే"

"కళ్ళక్రింద నల్లటి చారలు వచ్చాయి"

"ఇంకో కంపెనీ రాగానే అవే పోతాయి"

"ఇంకో ప్రొఫెషన్ మారితే గానీ అవిపోవు" అంది.

జయవేపు చురుగ్గా చూసాను.

నా చెయ్యి పట్టుకుని "పోదామా" అంది.

"ఎక్కడికెడదాం" అన్నాను.

"పామ్‌గ్రోవ్ కెళ్ళి టిఫిన్ చేసి, పిక్చరుకెడదాం"

"బస్సులో పోదాం"

"వద్దు బాబూ! కాలేజీకి వెళ్ళేటప్పుడు ఆ గొడవ ఉండనే ఉంది! ఇప్పుడు కూడా ఎందుకూ" అంది జయ!

ఆటోలో పోతుండగా "వాచీ ఎక్కడ తాకట్టు పెట్టావ్" అంది.

"ఏc"

"విడిపిద్దాం"

"ఇవ్వాళ విడిపించినా, మళ్ళీ రేపు అక్కడికే వెళుతుంది వద్దులే"

జయ మాట్లాడలేదు. ఆటో పామ్‌గ్రోవ్ దగ్గర ఆగింది. జయ ఆటోకి 'పే' చేసింది. ఇద్దరం ఎయిర్‌కండిషన్డ్ రూములోకి అడుగుపెట్టాం. రూమ్ అంతా కలర్‌ఫుల్‌గా ఉంది. మూలనున్న టేబుల్ దగ్గర ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాం. వెయిటర్ వచ్చి నిలబడ్డాడు. "రెండు గులాబ్ జాం - రెండు ఆనియన్ రవ్వ దోశ" అన్నాను.

కొంచెం నిశ్శబ్దం తరువాత "కష్టాల్లో జయ గుర్తుకు రాలేదు కదూ" అంది.

"మర్చిపోతే కదా జయని గుర్తు తెచ్చుకోవడం" అన్నాను

"అయితే... ఖాళీగా ఉన్నట్లు ఒక్కమాట చెప్పడానికి........"

"జయా! దీంట్లో ఓవర్‌గా ఆలోచించి, బాధపడాల్సిన విషయం ఏదీ లేదు. ఇదో "డ్రామా"! కొన్నాళ్ళు కష్టాలు - కొన్నాళ్ళు సుఖాలూనూ. ఔట్ డోర్ షూటింగ్స్‌కి వెళ్ళినప్పుడు "ఏ" క్లాస్ లాడ్జెస్‌లో ఉండి, సాయంత్రాలు మందు కొట్టి, ఇష్టమైంది తిని ఎంజాయ్ చెయ్యటంలా! చేతినిండా డబ్బున్నప్పుడు, సినిమాలు - షికార్లతో ఆనందంగా గడపడం లేదూ! మరి, అంత సుఖపడ్డప్పుడు కొంత కష్టం కూడా పడాలిగా!"

"నేనంత తేలిగ్గా ఆలోచించలేను రంగా! ఈ రోజు బాధలులు పడుతూ, రేపొచ్చే ఆనందాన్ని కలలో ఊహించుకుంటూ గడపలేను."

"అదే చూసావా! ఇంతవరకూ నువ్వు గడిపిన జీవితం "లిమిటెడ్"! నువ్వు డబ్బులో పుట్టావు, డబ్బులో పెరిగావు! కానీ నా జీవితం కండీషన్డ్! 'జిడ్డు కృష్ణమూర్తి'... ఏమన్నాడో తెలుసా!"...

"ప్లీజ్.... జిడ్డుకృష్ణమూర్తి ఏమన్నా.... నా తపన నాదే....నువ్వు మాటల్తో తల్లకిందులు చేయవచ్చు! కానీ నువ్వు అనుభవిస్తుంది నీకు తెలియదుగా! ఒక్కపూట భోజనం లేకపోతే జిడ్డు కృష్ణమూర్తి ఫిలాసఫీ కడుపు నింపుతుందా!"

"జయా! అన్ని పనులూ మనం కేవలం కడుపుకోసమే చేస్తున్నాం!"

"నిజమే! కానీ ఈ రోజు పోగొట్టుకుంది, రేపు పొందలేము కదూ!"

"అవును"

"ద ఫ్లవర్ దట్ స్మైల్స్‌టుడే - డైస్ టుమారో" అని నువ్వే చెప్పావు కదూ"

"అవును - 'కీట్స్' అన్నాడు"

"నీకు యాభై ఏళ్ళప్పుడు డైరెక్షన్ వచ్చిందనుకో -

అప్పటివరకూ నేను ఆగాలిగా!"...

"అవసరం లేదు. నేను త్వరలో డైరెక్ట్ చేస్తాను."

"ఎలా నమ్మను."

"నాకు కాన్ఫిడెన్స్ ఉంది"

"కేవలం కాన్ఫిడెన్స్‌తో డైరెక్షన్ చెయ్యలేవుగా... నీకొక ఆధారం కావాలి!.... రంగా! మీ ఇండస్ట్రీలో ఎంతమంది అసోసియేట్లు, డైరెక్టర్లూ కావాలని తపనపడుతూ, కాలేక బాధలు పడుతూ, అసిస్టెంట్లుగా ఉండి పోలేదు."

"అంటే నామీద నమ్మకం లేదా?"

"ఇప్పుడూ - ఎప్పుడూ నువ్వేం చెప్పినా నమ్ముతాను! కానీ, మా అమ్మా - నాన్నల్తో రంగబాబుకి కాన్ఫిడెన్సు ఉంది, ఏదో ఒకరోజు డైరెక్టర్ అవుతాడు. నాకెప్పుడూ కష్టంరాదు - అని చెబితే వాళ్ళు నమ్ముతారా?"....

"రంగా! అన్నా, తమ్ముడూ,... అక్కా, చెల్లెలు మధ్య అమ్మాయిని నేను. అందరికీ నేనంటే విపరీతమైన ఇష్టం. నాకు చిన్న దెబ్బ తగిలినా సహించలేరు. అటువంటిది, నువ్విలా ఆకాశంలో గాలిమేడలు కడుతూ, అనుక్షణం బాధలు పడుతున్నావని తెలిస్తే, వాళ్ళు -

మన పెళ్ళికి ఒప్పుకుంటారా? ఒక వేళ నేను - నీ దగ్గరకు వచ్చేసాననుకో, ఆ తర్వాత మా కుటుంబం నుండీ వచ్చే కాన్సీక్వెన్సెస్ తట్టుకోగలవా? ఒక్కసారి ఆలోచించు.................

నీ నిర్ణయం ఇప్పటికే ఆలస్యం అయ్యింది. ఇంకా ఆలోచిస్తూ కూర్చున్నావంటే, జయ నీకే కాదు, ఇంకెవ్వరికీ దక్కదు"

అని లేచి, గబగబ వాష్‌బేసిన్ దగ్గరకెళ్ళింది. సప్లయర్ కాఫీ తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

తల దిమ్మెక్కినట్టుంది.

"చెయ్యి కడుక్కో రంగా" అంది జయ.

నీరసంగా వెళ్ళి, చెయ్యి కడుక్కొచ్చి కాఫీ 'సిప్' చేసాను. వెయిటర్ బిల్లు తీసుకొచ్చాడు. జయ ప్లేట్లో వందరూపాయల నోటు వేసింది.

"నేను.... బాధపెట్టానా రంగా!"

"లేదు"

"ఏమిటి ఆలోచిస్తున్నావ్"

" నీ డిగ్రీ అయ్యేలోగా, నేను డైరెక్టర్ని కాలేకపోతే - ఈ ఇండస్ట్రీని వదిలేస్తా... నీకోసం" అన్నాను.

"రంగా...."

"ఇంకేం చెప్పకు జయా! అసోసియేట్‌గా ఉంటూ, నీకేం లోపం రాకుండా చూసుకోగలను! కానీ, ఏ సందర్భంలోనైనా కొంచెం కష్టం కలిగితే - ఇండస్ట్రీ వదలలేని బలహీనత వల్లే, ఆ కష్టాలు కలిగాయని నువ్వనుకోవడం, నేను కాదనడం, మళ్ళీ గొడవలు! ఇది నేను భరించలేను. నా ప్రొఫెషన్ విషయంలో కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలున్నట్టే, నేను గడపబోయే సంసారికమైన జీవితం మీద కొన్ని ఆశలున్నాయి! ఒకదాని కొకటి పోటీ పడ్డం నాకిష్టం లేదు...."

"రంగా! నేననేది"........

"నువ్వేం అనొద్దు! నన్ను చెప్పనీ!... నీతో పరిచయంకాకపోతే, అభిప్రాయం మారుండేది కాదు! కానీ ఈ రోజు భార్యగానే కాదు, వేరే విధంగా కూడా మరో అమ్మాయిని ఊహించుకోలేకపోతున్నాను. నిన్ను బలంగా నేను కావాలనుకున్నప్పుడు, నువ్వు త్యాగం చేయలేని కొన్నిటిని, నేను వదులుకోవాలి! దీనికి ప్రస్తుతం నేను సిద్ధమే!"

..................

"నా నిర్ణయం చెప్పాను - ఇకపై నువ్వెలాగంటే అలాగే"

...........

"బయలుదేరదాం"

ఇద్దరం లేచి బయటికొచ్చాం.

"ఇక నే వెడతాను" అన్నాను.

"ఈ సాయంత్రం అంతా నీతో గడుపుదామని వచ్చాను.."

"నీతో గడపడమిష్టమే... కానీ........."

"కానీ.... నామీద కోపం వచ్చింది కదూ!"

"ఛ.. ఛ.... ఛ.."

"అయితే నాతోరావు! ప్రతిసారీ చాలా హాపీగా నీతో గడపాలని రావటం, సంతోషంగా బయలుదేరటం, నేను - నిన్ను చికాకు పెట్టడం, నువ్వు కోపంగా వెళ్ళిపోవడం! ఆ తర్వాత అనుక్షణం నేను బాధపడ్డం.... మామూలైపోయింది. ఈసారైనా...."

........................

.......................

"సరే బీచ్‌కి పోదామా"

"నీ ఇష్టం ఎక్కడికైనా సరే"

✡✡✡

జయ అర చేతిని నా చేతిలో బిగించి నడుస్తుంటే, జయ మీద సర్వ అధికారాలు నాకు దత్తమైనట్లు ఒక భావన! ఈ భావనే జయకోసం - అనుక్షణం తపన పడేట్టు చేస్తుంది!...

బీచ్ పెద్ద కోలాహలంగా లేకపోయినా బిజీగానే ఉంది అస్తమయ సూర్యుని అరుణకాంతి, కెరటాల మీద పడి, ఆ 'రిఫ్లెక్షన్స్' జయ ముఖం మీద దోబూచులాడుతున్నాయి. జయ నడుం చుట్టూ చెయ్యి వేసి, కెరటాల అంచున నడుస్తుంటే, జయ నా లోలోనికి ఒదిగిపోయింది. గాలికి ముంగురులు జయ ముఖం కప్పివేస్తున్నాయి. జనం లేని ప్రదేశానికి చేరుకున్నాం. చుట్టూ చీకట్లు ముసురుకున్నాయి. ఒక చోట ఆగిపోయి జయని దగ్గరకు తీసుకుని, జయ తలని పట్టుకుని, బలంగా పెదాలమీద ముద్దుపెట్టుకున్నాను. జయ అభ్యంతర పెట్టలేదు.

"నిన్నిప్పుడు రేప్ చేయాలనిపిస్తుంది' అన్నాను.

"ఎందుకు" అంది అమాయకంగా!

"ఇప్పుడే నిన్ను నా దానిగా చేసుకోవాలనిపిస్తుంది గనక"

"నేను కాదంటేగా - నువ్వు రేప్ చెయ్యాలి"

"అయితే నీకిష్టమేనా"

"నీకు సంతోషం కలిగిస్తే - నాకిష్టమే! ఏ రోజుకైనా నీ దాన్నేగా."

జయ కళ్ళల్లోకి చూసాను. చీకట్లో ట్యూబ్‌లైట్స్ లాగా మెరుస్తున్నాయి, జయ కళ్ళు. "కూర్చుందామా! కాళ్ళు నెప్పిపుడుతున్నాయి", అంది జయ.

జయ ఒడిలో తలపెట్టుకు పడుకున్నాను పొడుగాటి వేళ్ళని తల్లో దూర్చి, 'క్రాఫ్' తో ఆడుకుంటుంది జయ.

"ఇకనుంచీ నీ మీద సర్వాధికారాలు నావి" అన్నాను.

అందంగా తలూపింది.

"ఈ చెయ్యి, తల, ముక్కు... పెదాలు... ఇంకా..."

"నేనే నీ దాన్ని" అంది

ప్రేమకి భాషలేదంట! ఒంటరి ప్రదేశంలో జయ ఒళ్ళో తల పెట్టుకు పడుకుంటే, ఎన్నో మాట్లాడాలనిపిస్తుంది. ఒక్కమాట బయటకు రావడం లేదు. కాలం అతివేగంగా పరిగెడుతోంది. జయ చేతిని తీసుకుని వాచీ చూసాను. పావుతక్కువ తొమ్మిది.

"వెడదామా జయా" అన్నాను.

"బోరు కొడుతుందా"

"లేదు! నీతో రాత్రంతా ఉండగలను. కానీ ఇంటి దగ్గర నువ్వే సమధానం చెప్పుకోవాలి."

నా తల్లోంచి చెయ్యి తీసింది జయ! నేను లేచి నిలబడి ఇసుక దులుపుకుని, జయని లేపాను. ఇద్దరం చేతిలో చెయ్యి వేసుకుని, ఇసుకలో నడుచుకుంటూ రోడ్డుమీదకొచ్చాం! మామిడి కాయ ముక్కలు కోసి, ఉప్పుకారం జల్లి బండి మీద అమ్ముతున్నారు.

"అవి తిందామా" అంది జయ.

"పుల్లగా ఉంటాయి" అన్నాను.

"అందుకే".... అంది

నేను చిలిపిగా నవ్వాను. జయ సిగ్గు పడింది. ముక్కలు కొని జయ చేతిలో పెట్టాను. జయ ఒక ముక్క కొరికి నా నోట్లో పెట్టింది.

"చాలా తియ్యగా ఉంది" అన్నాను.

"నే తిన్నది పుల్లగా ఉంది" అంది జయ.

"నాకు - నువ్వు కొరికి పెట్టావుగా" అన్నాను.

"నువ్వన్నీ ఇలాగే మాట్లాడతావు" అంది మురిపెంగా!

ఇద్దరం ఆటో ఎక్కాం! బీచ్ రోడ్డును దాటి ఆటో జనంలో పడింది. జయ నా భుజం మీద తలవాల్చి సగం మూసిన కళ్ళలో - ఆటో దాటుకుంటూ పోతున్న జనాన్ని చూస్తుంది. పీటర్స్ రోడ్డు రాగానే "ఆటో - స్టాప్" అంది! ఆటో ఆగింది! జయ హాండ్ బ్యాగ్ తీసి, దాంట్లో ఉన్న డబ్బంతా నా జేబులో కుక్కింది.

"వద్దు జయా" అన్నాను.

"నా మీద సర్వాధికారాలు ఉన్నప్పుడు - నా డబ్బు మీద కూడా ఉండాలిగా" అంది.

"ఇంత డబ్బు వద్దు" అన్నాను, జేబులోంచి డబ్బు తియ్యబోతూ

"నీ దగ్గర్నుండీ నేను తీసుకున్న దానిముందు - ఆ డబ్బు విలువెంత" అంది నేను ఆశ్చర్యంగా జయని చూసాను.

జయ నా గుండె మీద చెయ్యి వేసి, "ఇది నాదిగా" అని ఒక్క ఉరుకులో ఆటో దిగి, రోడ్ క్రాస్ చేసి, చెయ్యి ఊపింది. నేను అలాగే చూస్తున్నాను, ఆటో కదిలింది.

నా రూమ్ కాంపౌండ్ గేటు తీసి, మెట్లు ఎక్కేసరికి, రూమ్ మెట్లమీద అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాష్ కూర్చునున్నాడు.

"ఏం ప్రకాష్ ఇలా వచ్చావ్" అన్నాను.

"శంకరంగారికి హార్ట్ ఎటాక్ వచ్చింది సార్! రాయపేట హాస్పటల్లో జాయిన్ చేసారు. ఇంకా అన్ - కాన్షస్‌గానే ఉన్నారు."

షాక్ తిన్నాను.

"మధ్యలో ఓసారి కళ్ళు తెరిచి మిమ్మల్ని అడిగారు! మన ప్రొడ్యూసర్‌గారు కూడా అక్కడే ఉన్నారు. మిమ్మల్ని వెంటనే పిలుచుకురమ్మన్నారు."

మెట్లు ఎలా దిగానో, ఎలా హాస్పటల్‌కు వచ్చానో, ఎలా శంకరంగారి రూమ్‌లోకి వెళ్ళానో నాకే తెలియదు. శంకరంగారి రూమ్ చాలా నిశ్శబ్దంగా ఉంది. సెలైన్ ఎక్కిస్తున్నారు. ప్రొడ్యూసర్‌గారు బెడ్ ప్రక్కన చైర్‌లో కూర్చున్నారు. ప్రొడ్యూసర్ గారు సైగ చేసారు. కూర్చోమని! నేను శంకరంగారి కాళ్ళ దగ్గర కూర్చున్నాను. ఆయన ముఖం నిర్మలంగా, నిశ్చలంగా ఉంది. నా సర్వీసులో సగభాగం, ఈయన దగ్గరే గడిచిపోయింది. ఈయనతో తమ్ముడికంటే ఎక్కువగా మెలిగాను. ఆయన ముఖంలోకి అలాగే చూస్తుంటే, నా కళ్ళనిండా నీళ్ళు నిండి - ఆయన కాళ్ళ మీద పడ్డాయి! ప్రొడ్యూసర్‌గారు నా భుజం తట్టారు.

"ప్రమాదం ఏమీ లేదు రంగబాబూ! కంగారు పడకు" అన్నారు. గ్లూకోజ్ బాటిల్ ఖాళీ అయింది. సిస్టర్ నీడిల్ తీసేసి, స్టాండు మూలకి సర్ది వెళ్ళిపోయింది.

కాలం నిశ్శబ్దంగా గడిచిపోతుంది. అర్ధరాత్రి రెండు గంటలకి శంకరంగారు కళ్ళు తెరిచారు.

"సార్" అన్నాను. అంతకంటే మాట పెగల్లేదు.

"వచ్చావ్  రంగబాబూ"

తలూపాను. మళ్ళీ కళ్ళనిండా నీటిపొరలు కమ్మాయి.

"ధర్మారావుగారూ"

"ఇక్కడే ఉన్నాను సార్" అన్నారు ప్రొడ్యూసర్ గారు

"నా బెడ్ దగ్గరకు రండి"

ధర్మారావుగారు కుర్చీ బెడ్ దగ్గరకు జరుపుకున్నారు "ధర్మారావ్ గారూ! నేను పోయేముందు మీకొకటి చెప్పాలి...."

"సార్!... మీరు!...."

"నేను బాగుపడితే ఫరవాలేదు! లేకపోతే...? అందుకే నా మనసులో ఉంది ఇప్పుడు చెప్పాలి! ఇండస్ట్రీలో పాతుకు పోయిన ఏ పెద్ద ప్రొడ్యూసర్ కూడా నాకు చేయూత నివ్వడానికి ముందుకు రాలేదు. అయినా మీరు ఎంతో నమ్మకంతో నా దగ్గరకు వచ్చారు! మీరు నిలబడాలి! ఇంకో పది పిక్చర్లు తీయాలి! మనకంటూ ఒక యూనిట్ ఏర్పరచుకోవాలి. నేను బిజీ డైరెక్టర్లలాగా తలెత్తుకు తిరగాలని ఆశపడ్డాను." కానీ....

ఆయాసంతో కొంచెం ఆగారు. నేను గుండె నిమిరాను. ఆయన తన చేతిని నా చేతిమీద వేసి... "ఏం ఫర్వాలేదు రంగబాబూ" అన్నారు.

"ప్లీజ్! మీరు రెస్ట్ తీసుకోండి" అన్నాను.

"కొన్ని గంటల్లోనో - క్షణాల్లోనో అన్‌పెర్టర్బ్ రెస్ట్ తీసుకోబోతున్నాను దానికిప్పుడే ఎందుకు తొందరపడాలి" అన్నారు.

"సార్" అన్నాను.

"నన్ను మాట్లాడనీ రంగబాబూ!... ఈ ఇండస్ట్రీలో ఇన్నాళ్ళూ నోరూ - మనసూ, రెండూ కట్టేసుకునే ఉన్నాను. ఇప్పుడన్నా మాట్లాడనీ.. ధర్మారావుగారూ! ఈ రంగబాబు నా శిష్యుడు ఒకవేళ నేను పోతే, రంగబాబే డైరెక్ట్ చేయాలి నా పిక్చరు. నా భావాలు పూర్తిగా అర్థం చేసుకున్న టెక్నీషియను రంగబాబు! రంగబాబుని తప్ప వేరే డైరెక్టర్ని పెట్టనని మాటివ్వండి" అని చెయ్యి బలహీనంగా చాచారు!

'అలాగే తప్పకుండా రంగబాబే డైరెక్ట్ చేస్తాడు, కిందా మీదా పడైనా సరే పిక్చర్ పూర్తి చేస్తానని మాటిస్తున్నాను."

"చాలు ధర్మారావుగారుచాలు! బ్రతికున్న కాలంలో తృప్తిమిగలకపోయినా - పోయే టైమ్‌లోనన్నా ఆనందంగా ఉంది. మన సినిమా తప్పకుండా వందరోజులు ఆడుతుంది. ఆ నమ్మకం నాకుంది. రంగబాబూ"...

"సార్" అన్నాను.

"నా భావాలన్నీ నీకు తెలుసు నేను నీకు చెప్పేదేం లేదు. టైటిల్స్ లో సూపర్ విజన్ నా పేరు వేసి, డైరెక్షన్ నీ పేరు వేసుకో. ఇంక తియ్యవలసినవన్నీ ముఖ్యమైన సీన్లే నీ ఆలోచనలకీ - నా ఆలోచనలకీ పొంతన కుదరనప్పుడు, మొండిగా స్క్రిప్టు ఫాలో అవద్దు. నీకు మంచిదని తోచింది చెయ్యి!"...

"సార్! మీరు లేకుండా ఊహించుకోలేకపోతున్నాను..." అన్నాను. నా కన్నీళ్ళు ఆయన చేతిమీద పడ్డాయి.

"రంగబాబు! నేనంటే నీకు ఇంత"... ఆయనగొంతు నుండీ కూడా మాట పెగల్లేదు.

నేనూ మాట్లాడలేదు. మాట్లాడాలన్నా నా గొంతు పెగలడం లేదు.

డాక్టర్ వచ్చి ఇంజక్షన్ ఇచ్చాడు. కొన్ని క్షణాల తర్వాత శంకరంగారు నిద్రలోకి జారుకున్నారు. నా చెయ్యి ఆయన చేతిలోనే ఉంది. ధర్మారావుగారు జేబులోంచి పొగాకుకాడ తీస్తూ బయటకు వెళ్ళారు.

నేను శంకరంగారి బెడ్ మిద కూర్చునే ఉన్నాను. అలాగే మగతలోకి జారుకున్నాను.

కళ్ళు తెరిచేసరికి బాగా తెల్లవారిపోయింది. శంకరంగారి చెయ్యి చల్లగా ఉంది. "సార్... సార్..." అన్నాను.

జవాబు లేదు.

"సార్... డాక్టర్..." అని అరిచాను.

నర్స్ పరిగెట్టుకుంటూ వచ్చి, నా చేతిని శంకరంగారి చేతినుండీ లాగి, శంకరంగారి పల్సు చూసి, చెయ్యి వదిలేసింది. డాక్టరు వచ్చి చెక్ చేసి ‘ రాత్రి నిద్రలో పోయారు! సిస్టర్ - మిగిలిన ఫార్మాలిటీస్ చూడు" అన్నారు.

శంకరంగారి పెదాలమీద ఎన్నడూ చెరగని చిరునవ్వు తొంగి చూస్తోంది!

మరలా ఆఫీస్ వర్క్ మొదలైంది. నా డైరెక్షన్! శంకరంగారు బ్రతికుండగా రాని ఫైనాన్సియర్స్, ఆయన పోగానే సానుభూతితో చేయడానికి ముందుకొచ్చారు. హీరోయిన్ కాంతిశ్రీ - అనంతకుమార్, కాల్‌షీట్లు ఇబ్బంది పెట్టకుండా ఇచ్చారు. వాహినీలో షూటింగ్! మొదట అనంతకుమార్ డైలాగ్!

"నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను జయా" అనే క్లోజ్ షాట్‌ని.. షాట్ - కట్ చెప్పాను! జీవితంలో ఇదో అనుకోని మలుపు! మొదటి రోజు షూటింగ్‌లో వెయ్యికళ్ళు నన్ను పరీక్షిస్తాయని తెలుసు! నేను భయపడాల్సిందేమీలేదు. స్క్రిప్టు మీద నాకు ఫుల్ కమాండ్ ఉంది. మొదటిరోజు షూటింగుకు వచ్చిన పెద్దలు భుజం తట్టివెళ్ళారు. హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ సన్నివేశాలు చాలా చక్కగా వర్కవుట్ చేసారు శంకరంగారు. సినిమాలో హీరోయిన్ పేరు జయ! ప్రేమ సన్నివేసాలు తీసేటప్పుడు చాలా ఎమోషనల్‌గా ఫీలయేవాణ్ణి! హీరోయిన్ స్థానంలో జయ నవ్వుతూ నిలబడేది. ‘రష్‘ చూసిన ప్రతి ఒక్కరూ సున్నితమైన ప్రేమను అతి సున్నితంగా తీసానని" అన్నారు.

ఏ అవాంతరాలు లేకుండా ఇండోర్ షూటింగ్ అంతా అయిపోయింది. అవుట్‌డోర్ సాంగ్స్‌కి అరకువాలీ బదులు, ఊటీ వెళ్ళాం! పిక్చర్ మొత్తం అయిపోయింది. రషంతా ఎడిట్ చేసి, డబ్బింగ్ చేసేసాం! వెంటనే ఆర్. ఆర్. కాపీ వచ్చింది. రీ రికార్డింగ్ - మిక్సింగ్ అయిపోయింది ఫస్ట్ కాపీ వచ్చింది. పిక్చర్ చూసిన ప్రతి ఒక్కరూ "పిక్చర్ చాలా బాగుంది. అన్ని ఏరియాలు అమ్మకుండా కొన్ని చేతిలో పెట్టుకోండి. మంచి లాభాలొస్తా"యన్నారు. 'వేరే పెద్ద డైరెక్టర్ని పెట్టకుండా మంచి పని చేసావు ధర్మారావ్! కుర్రాడు శంకరం కంటే బాగా చేసాడు.' అన్నారొక ఇండస్ట్రీలో స్టాల్‌వార్ట్!

ధర్మారావుగారు పొంగిపోయారు. నా డైరెక్షన్‌లోనే ఇంకొక పిక్చర్ ఎనౌన్స్ చేసారు.

"శంకరంగారు పోయేముందు. ప్రతిసీను విపులంగా డిస్కస్ చేసారు! ఆయన భావాల అడుగుజాడల్లోనే నడిచి, పిక్చర్ పూర్తిచేసాను. నేను తీసింది ఫిల్మ్ మాత్రమే. దానిలోని ఆత్మ శంకరంగారిది" అని స్టేట్‌మెంట్ ఇచ్చాను.

ఏరియాలు మంచి రేటుకు అమ్ముడుపోయాయి. అప్పులన్నీ తీర్చగా మూడు లక్షలూ, రెండు ఏరియాలూ ధర్మారావుగారికి మిగిలాయి.

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకోవడానికి డిస్ట్రిబ్యూటర్లు మరునాడు వస్తున్నారు. ధర్మారావుగారు తనింట్లో 'లంచ్' ఏర్పాటు చేసారు.

లంచ్ అయిన తర్వాత అన్ని విషయాలు మాట్లాడుకుందాం అన్నారు. మర్నాడు ధర్మారావుగారింటికి వెళ్ళాను! ఆయన లోపలున్నారు. సోఫాలో కూర్చుని పేపరు చదువుతున్నాను.

"కాఫీ సర్..."

కాఫీ తీసుకోబోతూ తలెత్తి చూసాను. నా చేతులు అలాగే ఉండిపోయాయి!

"కాఫీ... సార్"

"గగన్ కుమార్... నువ్వు... మీరు."

"కాఫీ తీసుకోండి సార్! చల్లారి పోతుంది"

నా చేతుల్లో ఎందుకో అనుకోని షేకింగ్ వచ్చింది. గగన్‌కుమార్ కప్పు సాసర్ అందించాడు. కప్పు మా ఇద్దరి చేతుల్లోంచీ జారి, నా తెల్లటి ఫాంటు మీదనుంచీ నేలమీద పడింది. గగన్‌కుమార్ కంగారుపడుతూ నా ఫాంట్‌ను నేప్‌కిన్‌తో శుభ్రం చేస్తూ "సారీ - సర్ చేతులు వణికాయి" అన్నాడు. నేను సమాధానం చెప్పేలోగా ధర్మారావుగారు విసురుగా వచ్చి, గగన్‌కుమార్‌ని దవడమీద కొట్టారు! నేను అవాక్కయి నిలబడిపోయాను!

"వెధవా! డైరెక్టర్ గారనే గౌరవం లేకుండా... అంత కేర్‌లెస్సా!... నిన్నూ..." అని మరల చెయ్యెత్తగానే, నేను ఆ చేతిని పట్టుకుని ధర్మారావుగారూ...." అన్నాను.

"నువ్వూరుకో రంగబాబూ! వీడికి పెద్దఫోజు. చాలా రోజుల్నుంచీ చూస్తున్నాను. పనిచేసేటప్పుడు ఫేంటు మడత నలగనీడు! వీడు చేసేది బోయ్ ఉద్యోగం! పెద్ద హీరోలా ఫోజు..ఫోజని"

గగన్ కుమార్ మెడమీద చెయ్యిపెట్టి ఒక్క గెంటు గెంటారు! గగన్ కుమార్ వెల్లకిలా కార్పెట్ మీద పడ్డాడు. ధర్మారావుగారు మరలా అతన్ని పట్టుకోబోయారు.

"ధర్మారావుగారు! ప్లీజ్... అందులో అతని తప్పేమీ లేదు"

"ఏంటి రంగబాబూ... పనోడి మీద అంత జాలి... రేయ్! ఇక్కడినుంచీ వెంటనే వెళ్ళిపో.. లేకపోతే..." అంటూ రొప్పుతూ సోఫాలో కూలబడ్డారు.

గగన్‌కుమార్ చెంపమీద చెయ్యిపెట్టుకుని భారంగా వెళ్ళిపోయాడు. వెడుతున్నప్పుడు నా వైపు దీనంగా ఒక్క చూపు చూసాడు. ఆ చూపు వెనకాల కళ్ళల్లో ఉబుకుతున్న కన్నీళ్ళు గమనించాను.

"కూర్చో రంగబాబూ! లుంగీ కట్టుకుంటావా?"

"వద్దు సార్, ఫర్వాలేదు"

"వచ్చే డిస్ట్రిబ్యూటర్లు కుర్రకుంకలు! ఆ ఫేంటు చూసి - అది ఫేషననుకుని వెంటనే వాళ్ళ ఫేంట్ల మీద కాఫీ ఒలకబోసుకున్నా ఒలకబోసుకుంటారు," అని హాలు దద్దరిల్లేటట్లు నవ్వారు.

ఆయన నవ్వుతాడు.. ఇండస్ట్రీ అంతా పిక్చరు వంద రోజులు గ్యారంటీ అంటున్నారు! ఈయన చెప్పిన రేటుకి మిగిలిన ఏరియాలు కూడా కొంటానికి పార్టీలు తెగతిరుగుతున్నారు. సామాన్య వ్యక్తిలో బాధను గుర్తించే పరిస్థితి కాదిది!

✡✡✡

ఆ సాయంత్రం టి.నగర్‌లో గగన కుమార్ రూముకెళ్ళాను. ఆరునెలల క్రితమే రూం ఖాళీ చేసాడంట! అతను తేనాంపేటలో ఉంటున్నట్లు పాండి బజార్‌లో తెలిసింది.

తేనాం పేట 'స్లమ్' ఏరియాలో గగన్ కుమార్ గురించి అడుగుతూ, చివరకు ఇల్లు పట్టుకున్నాను. జీర్ణావస్థలో ఉన్న పాక! ఇంటి ముందు పెద్ద మురిక్కాలువ! "జుయ్" మని దోమల రొద. ఒక మూల త్రాగినోళ్ళ గోల. ముక్కుకి హేండ్ కర్చీఫ్ అడ్డం పెట్టుకుని, తడిక తోసాను - చీకట్లో గగన్‌కుమార్ బోర్లాపడుకున్నాడు!

"గగన్‌కుమార్ ... గగన్ కుమార్ గారూ..."

గగన్ కుమార్ ఉలిక్కిపడి లేచాడు.

"మీరా! రండి సార్.. కూర్చోమంటానిక్కూడా.. ఏమీ లేవు!" అన్నాడు.

ముక్కునుంచి హేండ్ ఖర్చీఫ్ తీసి క్రిందున్న చింకి చాప మీద కూర్చున్నాను.

"మీరూ... కూర్చోండి" అన్నాను.

"థాం...క్యూ" అని గడపమీద ఓరగా కూర్చున్నాడు. అతను నోరు తెరిచినప్పుడు "గుఫ్" మని నాటుసారా వాసన తగిలింది. కడుపులో త్రిప్పి మళ్ళీ ముక్కు మూసుకున్నాను.

"క్షమించండి! బాధలో నాటు కొట్టేసాను" అని గబగబ లేచి వెళ్ళి, పదినిమిషాల్లో మొహం కడుక్కుని వచ్చాడు.

పది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఏం మాట్లాడాలో నాకు తెలియలేదు. ఏదో బాధ, ఆవేశంలో - ఇతన్ని వెతుక్కుంటూ వచ్చాను" ఉదయం జరిగినదానికి బాధపడ్డారా" అన్నాను చివరికి.

నవ్వి, "బాధపడి మాత్రం చేసేదేముంది సార్! పేదవాని కోపం పెదవికి చేటు. కోపం పడకుండానే పెదవికి చేటయింది" అన్నాడు.

"మీరు ఇంత ఇదిగా మాట్లాడతారు, నాటుసారా తాగే పరిస్థితికి  దిగజారినందుకు..."

"ఏనాడు ఇల్లు విడిచి పెట్టి మద్రాస్ చేరానో, ఆనాడే దిగజారి పోయాను. కొత్తగా దిగజారిందేమీ లేదు సర్"

"దిగజారాను - దిగజారాను అనుకుంటూ - ఇంకా మెట్లు దిగుతున్నారే కానీ, ఏ ఆశయం కోసం వచ్చారో, దాన్ని సాధించడానికి ప్రయత్నించడం లేదు."

"అన్ని రకాలుగా ప్రయత్నించాను సార్. నేను మీ రూమ్‌కి వచ్చినప్పుడు మీరు చెప్పిన మాటలన్నీ - ఆ రాత్రి మననం చేసుకున్నాను. ఆర్టిస్టుగా స్థానం సంపాదించాలంటే, ముందుగా వేషం ఇచ్చే స్తోమత ఉన్నవాళ్ళతో పరిచయం పెంచుకోవాలి. సంవత్సరం పాటు ఏమీ ఆశించకుండా ప్రయత్నించాలి. నాకు వేషాలు రికమెండ్ చేసే సర్కిల్ లేదు. ఒక నెలకి సరిపడా డబ్బు పంపే వాళ్ళు లేరు. అసిస్టెంట్

డైరెక్టర్‌గా చేస్తూ, పదిమందితో పరిచయం పెంచుకుని అప్పుడు వేషాలు ప్రయత్నిద్దామని ఆలోచించి, గుర్నాధంగారి వద్ద అప్రంటీస్‌గా చేరాను. ఆరోజు మీరు చూసారుగా!"

తలూపాను.

"అసిస్టెంట్ డైరెక్టర్ పుణ్యమా అని మొదటిసారి క్లాప్ కొట్టాను. హీరోయిన్ క్లోజ్ షాట్. క్లాప్ దించి కొట్టమన్నారు అసిస్టెంటు డైరెక్టరుగారు. క్లాప్‌ని కొట్టినప్పుడు నా కంగారు మూలంగా బోర్డ్ ఆవిడ భుజానికి తగిలి - కాకిలా అరిచింది. దాంతో సెట్టంతా గోలయ్యి, అందరూ ఆవిడ్ని ఓదార్చి - నన్ను బయటికి తోలేసారు. ఆవిడకి దెబ్బ తగిలిందో లేదో కానీ, నా జీవితానికి పెద్ద దెబ్బ తగిలింది సార్! ఆర్టిస్టుగా పనికి రాకుండా పోయాను. అప్రంటీస్‌గా ఫూల్‌నయ్యాను. చివరికి బోయ్‌గా కూడా...ఛీ...ఛీ నా బ్రతుకే వృధా సార్!"

"అలా డిసప్పాయింట్ అవకండి, మీరు..."

"సార్! నన్ను 'మీరు' అనకండి. మీరు అనిపించుకునే స్థితి ఏనాడో పోయింది."

"స్థితిని బట్టి కాదు గౌరవం ఇవ్వాల్సింది. మనిషిని బట్టి"

"నన్ను 'మీరు' అంటే, మీరు నేను దూరం అయినట్లు అనిపిస్తుంది... ప్లీజ్..."

"సరే! తర్వాత ఏం చేద్దామనుకుంటున్నావ్"

"నిజం చెప్పమంటారా....?"

.................

"చచ్చిపోదామనుకుంటున్నాను..."

"గగన్‌కుమార్..."

"ఇంకా నాకు మిగిలిందేముంది సార్..."

"అంటే ప్రతి సమస్యకు చావొక్కటే పరిష్కారం అనుకుంటున్నావా?"

"నాకు అంతకంటే గత్యంతరం కనిపించడం లేదు సార్"

"మనం పుట్టింది చావటానికి కాదు గగన్‌కుమార్. సాధించాలి!

సాధన తపస్సులాంటిది ఎన్నో అడ్డంకులు ఎదురౌతాయి. లొంగినట్లు లొంగి దెబ్బతియ్యాలి! ఇన్ని బాధలు పడిన తర్వాత పొందిన ఫలంలో ఎంత తృప్తి! షేక్స్పియర్ ఏమన్నాడొ తెలుసా 'కొంతమంది పుట్టుకతో గొప్పవాళ్ళుగా పుడతారు, కొంతమంది గొప్పతనాన్ని సాధిస్తారు. కొంతమంది వ్యక్తుల మీద గొప్పతనం ఆపాదించబడుతుంది. మనం మధ్య తరగతి వాళ్ళం! మనకీ సంఘర్షణ ఒక స్టేజ్ కి చేరేవరకూ తప్పదు! ఏరోజు నిరాశ పడ్డామో - ఆనాడు, జరిగిన ఒక తప్పుగురించి పదే పదే ఆలోచిస్తూ, ఇక తప్పులే చేస్తాం. దాంతో జీవితం తప్పుడు తోవన పడుతుంది!..."

.........................

నేనూ బాధలు పడ్డాను. ఈ కాంపిటిటీవ్ సర్కిల్లో స్థానం సంపాదించడం కోసం, బ్రతుకు తెరువు కోసం పడరాని పాట్లు పడ్డాను. నాకున్న ఒకే బంధం మా నాన్నగారు. ఆయన పోయినట్లు టెలిగ్రాం వస్తే, డబ్బులేక తలకొరివి పెట్టడానికి వెళ్ళలేకపోయాను. ఆరోజంతా నా పరిస్థితిని తలుచుకుని, కుమిలిపోయాను. 'తండ్రిని కడసారి చూడ్డానికి రాని కర్కోటకుడ్ని' మేనత్తలందరూ తిట్టిపోసారు. నా అసమర్ధత నిస్సహాయ స్థితి వాళ్ళకేం తెలుసు?.... ఎలా చెప్పగలను...? ఆ సంఘటన నాలో బలంగా ముద్ర

వేసుకుపోయి, కసిరేకెత్తించింది. దెబ్బ తిన్న చోటే పైకి రావాలని పట్టుబట్టాను - దాని ఫలితం చూసావుగా..."
'జీవితమంటేనే స్ట్రగుల్, ఎవరిలో ఈ బాధ, ఈ స్ట్రగుల్ ఆగిపోతుందో వారు నిర్జీవులు' అన్నాడు చలం! మనం నిర్జీవులం కాకూడదు! సాధించాలి... బి బ్రేవ్!"

...............

"నేను ఏ ఆర్టిస్టుతోనూ, ఆర్టిస్టు అవుదామని వచ్చిన ఏ వ్యక్తితోనూ ఇలా మాట్లాడలేదు! కానీ, నీతో అనుకోని అనుబంధమేదో ఏర్పడింది. బహుశా నువ్వు చదువుకున్నవాడివి అవ్వడం వల్ల కావచ్చు, లేదా నీ జీవితంలో అనుభవించిన ప్రతి సంఘటన రిజల్టూ నేను చూడటం వల్ల కావచ్చు.. ఉదయం జరిగిన ఇన్సిడెంట్‌కి, నువ్వెంత బాధపడ్డావో - నేనూ అంత బాధపడ్డాను! అందుకే ఇక్కడకి వచ్చాను! డోంట్ బి ఎక్సైటెడ్

....................

"ఇక నే వస్తాను. ఈ డబ్బు వుంచుకో"

"వద్దు సార్! ప్లీజ్... వద్దు"

"ప్రస్తుతం ఉంచు! నీకు డబ్బొచ్చిన తర్వాత ఇద్దువుగాని" అని బలవంతాన అతని జేబులో పెట్టి లేచి గుమ్మం దాటబోయాను.

"సార్" అన్నాడు గగన్‌కుమార్

ఆగి వెనక్కి తిరిగాను.

గగన్‌కుమార్ వంగి కాళ్ళకి నమస్కారం పెట్టాడు.

"గగన్ కుమార్" అని లేపాను.

"సార్! నా తల్లి తండ్రులక్కూడా ఎప్పుడూ నమస్కారం పెట్టలేదు నేను - మీ మంచితనానికి... కృతజ్ఞతగా... ఇంతకంటే..."

అతని గొంతు బొంగురుపోయి మాటలు రాలేదు. కానీ ధారగా కన్నీళ్ళు కారుతున్నాయి. అతని భుజం తట్టి రోడ్డు మీద పడ్డాను.

పిక్చర్ రిలీజ్ ముందు ప్రివ్యూ వేసాం! జయ తన ఫ్రెండ్స్‌తో వచ్చి చూసింది! ఫ్రెండ్స్ అందరూ, నన్ను కంగ్రాట్ చేస్తుంటే జయ చాలా గర్వంగా నవ్వింది. వాళ్ళందరినీ మా ప్రొడక్షన్ కారులో 'బుహారీ'కి తీసుకెళ్ళి పార్టీ ఇచ్చాను. పార్టీ తర్వాత వాళ్ళందరూ 'రూప్‌కళా'లో షాపింగ్ చేసుకెళతామని మౌంట్ రోడ్డులో ఆగిపోయారు. నేను కార్లో వస్తుంటే 'సఫైర్' ముందు మా పిక్చర్ బేనర్ తళుకుల్తో మెరుస్తుంది. ఎల్లుండి మా పిక్చర్ ఆంధ్రాలో రిలీజు! అదే రోజు మద్రాసులో కూడా రిలీజవుతుంది. ఆంధ్రా, తమిళనాడుల్లో ఒకేసారి తెలుగు పిక్చర్ రిలీజయే ఏర్పాటు ధర్మారావుగారే చేసారు! ప్రొడ్యూసర్ - ధర్మారావ్! సాయంకాలపు ట్రాఫిక్ లైట్లు ఆ అక్షరాల మీద పడి మెరుస్తుంటే నాకళ్ళల్లో కొత్త వెలుగులు విరిసాయి.

-

**రిలీజుకి** బెజవాడ వెళ్ళాం! "శంకర్రావు గారు లేని లోటు సినిమాలో ఎక్కడా లేదు. పిక్చర్ చూడముచ్చటగా ఉంది. "స్క్రిప్ట్ ఎంత అందంగా ఉందో, డైరెక్షన్ అంత పకడ్బందీగా ఉంది. ఈ యువ దర్శకుడి చేతిలోంచి మరికొన్ని మంచి చిత్రాలు వెలువడాలని." పత్రికలన్నీ రాసాయి! ఆడవాళ్ళని బాగా ఆకర్షించింది. సినిమా వందరోజులు గారంటీ!

విజయవాడ నుండి వచ్చేసరికి, మహాలింగపురంలో ఒక ఇల్లు తీసి, ఫర్నిషింగ్ చేయించారు, ధర్మారావుగారు! దిగటం, దిగటం కొత్తింట్లో దిగాను! హాలు, బెడ్‌రూం, డ్రాయింగ్‌రూం మొత్తం చాలా రిచ్‌గా ఉన్నాయి! సోఫాలో కూర్చొని, సీలింగ్ కేసి చూసాను.

ఉదయం ఎండలో డెకోలం పెయింట్ మెరుస్తోంది. ఫేను స్పీడుగా తిరుగుతోంది. నా జీవితం ఎంత తమాషాగా మారింది. శంకరంగారు సినిమా ఇండస్ట్రీలో బాధపడి, చివరికి తను అనుభవించలేని గొప్పతనాన్ని నాకందించి వెళ్ళారు. హాల్లో గోడగడియారం ఎనిమిది గంటలు కొట్టింది. లేచి బాత్‌రూం తలుపు తీసాను. ఎదురుగా అద్దంలో నా ముఖం కనిపిస్తోంది.. రాత్రి ప్రయాణం మూలంగా కళ్ళలో ఎర్రని జీరలు కనిపిస్తున్నాయి. ఇదివరకెప్పుడూ కనిపించని, పట్టుదలలాంటిదేదో కళ్ళలో కనిపిస్తుంది. నేను కూడా మూర్తిలా మారతానా...?? ఇదివరకటి నా రూమంత విశాలంగా ఉంది బాత్‌రూం, ట్యాప్స్ - తెల్ల మెజాయిక్ ఫ్లోరింగ్, హీటర్, చాలా అందంగా ఉంద్.

స్నానం చేసివచ్చేసరికి పనికుర్రాడు కాఫీ తెచ్చాడు. బట్టలు వేసుకునేసరికి కంపెనీ కారు వచ్చింది. చాకలి వస్తే బట్టలు వెయ్యమని చెప్పి, నేను కారెక్కాను. కారు పెరియార్ బ్రిడ్జి మీదనుండి వెడుతుంది. ఈ రోజు నేను అనుభవించే విజయంలో ముప్పాతిక శంకరంగారికి చెందుతుంది. ఆయన లేరు కనుక మొత్తం నామీద ఆపాదింపబడుతుంది. ఆయన కుటుంబానికి ఒకదారి చూపించాల్సిన బాధ్యత నాదే!

✡✡✡✡

ఆఫీసులో నా రూములో కూర్చున్నాను. అభినందన పరంపర ఎక్కువగా ఉంది! పన్నెండింటికి ధర్మారావుగారు వచ్చి, "రంగబాబూ! ముగ్గురు ప్రొడ్యూసర్లు నిన్న మా ఇంటికి వచ్చారు! నిన్ను పెట్టుకోవాలనుకుంటున్నారు. నీ రెమ్యునరేషన్ అడిగారు ఎంత చెప్పమంటావ్!"

"మీకు తెలియందేముంది"

"ఏం లేదు, పక్కా వ్యాపారస్తుణ్ణయినా, నాక్కొన్ని పద్ధతులున్నాయి. నువ్వు డైరెక్ట్ చేసినందుకు, ప్రత్యేకంగా డబ్బేమి ఇవ్వలేదు. అసోసియేట్‌గా ఎగ్రిమెంట్ చేసిన ఎమౌంట్ ఇచ్చాను. అయితే పిక్చర్ బాగా అమ్ముడయింది కనుక, బెజవాడ వెళ్ళేముందే నీకొక ఇల్లు తీసి, ఫర్నిషింగ్ చేయించమని చెప్పెళ్ళాను. మొదటి పిక్చర్లో ఇంతకంటే నేనేం చేయలేను. రెండో పిక్చర్‌ని నీకొక ఎమౌంట్ ఇస్తాను."

"మీరెంతిచ్చినా నా కభ్యంతరం లేదు. శంకరంగారు చెప్పగానే ఏమాత్రం భయపడకుండా - నన్నే డైరెక్టర్‌గా పెట్టుకుని, నాకొక లైఫ్ ఇచ్చారు. ఈ సంస్థ నాకు మాతృ సంస్థలాంటిది. ఇక్కడ పైసా తీసుకోవచ్చు! అసలు తీసుకోకపోవచ్చు! కానీ...."

"నువ్వేం చెప్పొద్దు! ఈ విషయంలోనే నిన్నడిగి చేద్దామని! దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి! ఈరోజు కుర్ర డైరెక్టర్లో నీకు ఛాన్స్ తగిలింది! నీ గురించి వాళ్ళలో అలాంటి అభిప్రాయం కలిగించాను! నిన్నొదిలి వాళ్ళు ఎక్కడికీ పోరు! ముందుగా యాభై చెబుతాను! తరువాత చూద్దాం..."

"అలాగే" అన్నాను

"నీ దగ్గరున్న స్క్రిప్టులన్నీ వర్కవుట్ చేసుంచు! మంచి సబ్జక్ట్ టేకప్ చేద్దాం. రెండో పిక్చర్ కూడా హిట్టయిందంటే - ఇండివిడ్యుల్‌గా మంచి పేరొస్తుంది. నువ్వు పూర్తిగా సెటిలవుతాయి." అన్నారు

"అలాగే" అన్నాను.

ధర్మారావుగారికి ఫోనువచ్చింది! ఆయన వెళ్ళారు. ధం.. ధం... లక్ష్మణరావు వచ్చాడు. "నమస్కారం గురువుగారు. మొదటి పిక్చర్ సూపర్ హిట్ చేసారు" అన్నాడు.

"నాదేముందు -- క్రెడిటంతా శంకరంగారిది! ఆయన లేరు గనక అదంతా నామీద పడింది" అన్నాను

"ఆఁ.. మూడొంతుల పిక్చర్ మీరే చేసారంటగా"

"ఎవరన్నారు?"

"షూటింగ్ చూసినవాళ్ళు చెప్పారు! పాండీబజార్లో మీ గురించి మ్రోగిపోతోంది"

"అద్సరే! నువ్విటొచ్చావేంటి?"

"ఏం లేదు గురుగారు! మావాడొకడు ఆర్టిస్టుగా ట్రై చేద్దామని వచ్చాడు... ఏదో మీ చేతుల్లో పడ్డాడంటే పైకొస్తాడనీ.."

"వేషం కోసం ట్రై చేసేవాణ్ణి తేకుండా, నువ్వొస్తే ఎలా"

"అతన్నెప్పుడు తీసుకురమ్మంటే అప్పుడు తీసుకొస్తా గురువుగారు! మీరుంటారనుకోలేదు. లేకపోతే నావెంటబెట్టుకు వచ్చేవాణ్ణి"

"ఇంత శ్రద్ధ తీసుకుంటున్నావ్... పెద్ద గిరాకీయా..."

"అమ్మమ్మ! డబ్బు గురించి కాదు గురువుగారూ! కుర్రాడు నాకు బాగా నచ్చాడు! పట్టుదలుంది! ఇండస్ట్రీలో వెంటనే ఛాన్స్ దొరక్క పోయినా నిరాశపడకుండా నిలబడి ప్రయత్నించే తాహతున్నట్టు కనిపించాడు వేషాలు ఊరికే దొరుకుతయ్యా! పది జతల చెప్పులరగాలి"

✡✡✡✡

"మీకు తెలియదా గురువుగారు! రోజూ ఎంతమంది వేషాలకోసం మెయిలు దిగుతున్నారూ! 'ట్రై'చేసి చివరికి వేషాలొచ్చే టైముకి బాధలు పడలేక ఊరు పారిపోయేవాళ్ళు కొంతమంది, ఉద్యోగాలు వెతుక్కునే వాళ్ళు కొంతమంది, ఊరుమీద పడేవాళ్ళు కొంతమంది. ఉదాహరణకి గగన్‌కుమార్ చూడండి.. మంచివేషం ఇప్పిద్దామనుకున్న టైంలో ఏంచేసాడో..."

"ఏం చేసాడు..."

"మీకు తెలియదా గురువుగారు"

అడ్డంగా తలూపాను.

"అరె! ఇండస్ట్రీ అంతా తెలుసు మీకు తెలియదా"

"ఊరందరిదీ ఒకదారి - ఉలిపి కట్టెదొకదారి అని, నాదంతా వేరేగానీ! ఇంతకీ గగన్‌కుమార్, ఇండస్ట్రీ చెప్పుకునేంత గొప్ప పనేం చేసాడు."

"ఆత్మహత్య చేసుకున్నాడుగా గురువుగారు!"

"ఆఁ" అన్నాను! చేతిలో తిప్పుతున్న పేపర్ వెయిట్ ధడాలున టేబుల్ మీద పడింది!

✡✡✡✡

"ఎలక్ట్రిక్ ట్రైయిన్ దూకాడంట! తలపగిలిపోయింది! మా ఆర్టిస్టుల్లో ఎవరో చూసి, పోలీస్ కంప్లైయింట్ ఇచ్చారు. కార్పోరేషన్ వేన్లో వేసుకుని పోయారు. పాపం! ఏ తల్లి కన్నబిడ్డడో - ఇక్కడకొచ్చి దిక్కులేని చావు చచ్చాడు"

"వాళ్ళ తల్లితండ్రులకు తెలియదా?"

"అతను ఆ వివరాలేవి ఎప్పుడూ మాకు చెప్పలేదు గురూ గారూ! పోలీసులు అతని అడ్రసుకు వెళ్ళి ఎంక్వయిరీ చేసారంట. అంతకు ముందు రెండు రోజుల్నుంచే భోజనం లేనట్టున్నాడంట! చచ్చిపోవడానికి ముందు రోజు, రాత్రంతా కూర్చుని ఏదో రాసాడంట! అర్ధరాత్రిపూట గగన్‌కుమార్ రూములో మంట మండుతుంటే, తడికివతలి పోర్షన్ మనిషి వచ్చి 'ఏంటి తగులబెడుతున్నావ్' అని అడిగాడంట. 'పాత ఉత్తరాలు' అని అన్నాడంట! ఉత్తరాలతోపాటు ఫోటోలు కూడా ఉన్నాయంట! "ఫోటోలు కూడా కాల్చేస్తున్నావే"

అంటే "వాటితో ఇంక పనిలేదు" అన్నాడంట! ఇంత రాత్రి తగలబెడుతున్నావేంటి అంటే "ఎందుకో ఇప్పుడే వీటన్నిటినీ కాల్చేయాలనిపించింది" అన్నాడంట! అతను వచ్చేసాడంట! ఏంటో సార్ కొందరి జీవితాలు."

".. .."

"ఉంటానుసార్! ఇంకా రెండాఫీసులకు వెళ్ళాల్సిన పనుంది. మీరు నా ముఖం చూసి సాయం చేయాలి" అని నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

నేనలాగే కూర్చుండి పోయాను ఏదో తెలియని శూన్యం హృదయం నిండా కమ్ముకుంది. ఏదో సాధించాలని తపనపడుతూ సాధించలేక నిరాశతో నిండు జీవితాన్ని భగ్నం చేసుకున్న అజ్ఞాత జీవులన్నీ పెడుతున్న రోదనతో - నా చెవులు గింగురుమన్నాయి. పట్టపగలు ఏవో నీడలు నాకళ్ళముందు తిరగడం మొదలు పెట్టాయి. హృదయం నిండా శూన్యం. కళ్ళముందు నీడలు, చెవుల్లో రోదనలు, భరించలేక కళ్ళుమూసుకున్నాను.

"సార్.........సార్"

కళ్ళు మెల్లగా విప్పాను. డ్రైవర్!

"కళ్ళలో నలక పడిందా సార్"

కళ్ళు తుడిచాను! కంటినిండా నీళ్ళు ఉబుకుతున్నాయి ఎందుకు నాలో ఇంత వేదన! నాకూ - గగన్‌కుమార్‌కి ఏమిటి సంబంధం.

"మీరు ఇంటి దగ్గర ఇప్పుడే దిగుతారా! ధర్మారావుగారిని దించి రమ్మంటారా?"

"నేనూ వస్తాను" అని లేచాను.

కారు పెరియార్ బ్రిడ్జిమీద నుండి వెడుతోంది. "గుఁయ్" మని అరుచుకుంటూ ఎలక్ట్రిక్ ట్రైయిన్ పరుగులు పెడుతూ వస్తూంది రణరంగంలో శత్రువుని చంపిన తర్వాత, వీరుడు మ్రోయించే విజయశంఖంలో ఉందా కూత! భరించలేకపోయాను.

"ఏమిటి రంగబాబు! అనీజీగా ఉన్నావు!" అన్నారు ధర్మారావ్‌గారు.

"కొంచెం తలనొప్పిగా ఉంది"

"సారిడాన్ వేసుకుని నిద్రపో, తగ్గిపోతుంది" అన్నారు.

ఇంటి దగ్గర దిగిపోయాను.

"సాయంకాలం రమ్మంటావా" అన్నారు.

"వద్దు సార్! ఇవ్వాళ రెస్టు తీసుకుంటాను, రేపు కలుసుకుందాం!"

"ఉంటాను" అన్నారు ధర్మారావుగారు!

కారు వెళ్ళిపోయింది. బోయ్ భోజనం పెట్టాడు అన్నంలో చెయ్యిపెట్టి సహించలేక లేచిపోయాను - పక్క మీద పడుకున్నాను! కానీ నిద్రపట్టడంలేదు. ఏ ఆలోచనా లేదు. ఏదో రెస్ట్‌లెస్‌నెస్! అలాగే నిద్రపట్టేసింది.

కళ్ళు తెరిచేసరికి అయిదుగంటలు! షవర్ బాత్ తీసుకుని, బట్టలు వేసుకుని హాల్లో కూర్చున్నాను. ఇల్లు మరీ బావురుమంటుంది! త్వరగా జయను తెచ్చేసుకోవాలి. ఈ ఒంటరితనం ఇంక భరించలేను! నా ఛాలెంజ్ నెగ్గించుకున్నాను. వాళ్ళ నాన్నని ఒప్పించే బాధ్యత జయదే! బోయ్ టిఫిన్ తెచ్చాడు.

"నేను తెమ్మనలేదుగదోయ్" అన్నాను.

"మధ్యాహ్నం భోజనం చేయకుండా పడుకున్నారుగా మీరు! లేచేసరికి ఆకలేస్తుందని నేనే తెచ్చిపెట్టాను సార్" అన్నాడు.

వెంటనే అయిదురూపాయలు వాడికి బక్షీస్ ఇచ్చాను. ఇటువంటి చాకులాంటి కుర్రాడే నాకు అవసరం! 'నీ అవసరాలు నీకు తెలియవు. ఎప్పుడూ నిన్ను అంటిపెట్టుకుని ఎవరో ఒకళ్ళు ఉండాలి బాబు!' అనేది జయ!

చెయ్యి కడుక్కోగానే కుర్రాడు నేప్‌కిన్ అందిస్తూ,

"ఏదో కవర్ వచ్చింది సార్! డ్రాయింగ్ రూములో టేబుల్ మీద పెట్టాను" అన్నాడు.

"తీసుకురా" అన్నాను.

వాడు తెచ్చిచ్చాడు. కవరు మీద నాలుగు పోస్టల్ ముద్రలున్నాయి. నా పాత అడ్రసుకు వెళ్ళి ఇక్కడికి రీ - డైరెక్ట్ చేయబడింది. నాకు పరిచయం లేని రాత! కవరు విప్పాను నాలుగుపేజీల లెటరు...

స్థలం:- తేనాం పేట స్లమ్ ఏరియాలో, మురికి కాలువ ప్రక్కన - ఒక పాకలోని చీకటి గది.

కాలం:- చరమ కాలం....

తేదీ:- భూమ్మీద ఒక అభాగ్యుని జీవితంలో ఆఖరు దినం!

రంగబాబుగారి పవిత్ర పాదాలకు,

శిరస్సు వంచి నమస్కరించే గగన్ కుమార్!

ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి నీచుడికీ 'గౌరవనీయులైన' - మహారాజశ్రీ' - అనే తదితర సంబోధనలు వాడేసారు, వాడుతున్నారు. ప్రతి నికృష్టుడికీ అవే సంబోధనలు అవడం వల్ల, అవి - వాటి, విలువ కోల్పోవడమే కాకుండా మైలపడ్డాయి! 'దైవసమానులు' అని రాద్దామనుకున్నాను, నిజంగా దేవుడనే వాడుంటే - వాడు కొన్నివేల సంవత్సరాల క్రితమే మైలపడ్డాడు. పైగా వాడంటే నాకు నమ్మకం లేదు. ఎన్నో ఆలోచించాను, మీ ఉన్నత - వ్యక్తిత్వానికి తగిన సంబోధన పెట్టగలిగే శక్తిలేక, ఏదో ఒకనాడు కాలమే పూరిస్తుంది!

ఈ రాత్రిపూట మీకు ఉత్తరం ఎందుకు రాస్తున్నానో తెలుసా సార్! రేపు నేను చచ్చిపోవాలని నిర్ణయించుకున్నాను 'చావు పిరికివాడి ఆయుధం' అని మీరంటారు! ఒప్పుకుంటాను! "మనిషి జీవితంలో ఎన్నో అడ్డంకులు వస్తాయి. లొంగినట్టే లొంగి దెబ్బతియ్యాలి" అన్నారు మీరు. అదీ నిజమే! కానీ, అందరికీ అది సాధ్యపడదు. నా జీవితంలో అడ్డంకులకి లొంగి పోవడమే జరిగింది. ఇంక దెబ్బతీయగల శక్తి ఎక్కడిది? కేవలం బ్రతకడమే జీవిత ధ్యేయమయితే, కూలి చేసో, ఖూనీ చేసో, దొంగతనం చేసో, ఆడవాళ్ళను తార్చో జీవించగలను. కానీ నాక్కావలసింది ఆ జీవితం కాదు. నా వ్యక్తిత్వం కోల్పోని జీవితం!

నా మనసు వ్యతిరేకించిన ఉద్యోగాలు చేసి, నన్ను - నేను కించపరచుకోవడం అటుంచి, ఓడిపోయాను. అనుక్షణం నిరాశే ఎదురయ్యింది! మీ పరిచయమే లేకపోతే నేనాడో ఈ లోకం విడిచిపెట్టిందును! కానీ, మీరు తాత్కాలికంగా ఉత్సాహపరిచారు. నా కెదురైన ఓటమిల ముందు ఆ ఉత్సాహం నీరు కారిపోయింది! ఒక్కసారి నా కుటుంబ ఔన్నత్యానికి - మద్రాసులో నేను గడిపిన జీవితానికి పోల్చి చూసుకుంటే శరీరమంతా ఒణికి పోతుంది. నేనెంత దిగజారిపోయానో కూడా అంచనాలకి అందడంలేదు. ఇంత దిగజారానా ఈ మద్రాసు సినీ ప్రపంచంలో నేను సాధించిందేమిటి?... నిరాశ... అనుక్షణం బ్రతుకు మీద భయం నామీద నాకే కోపం... ప్రపంచం మీద కసి... నాలో భావనల్ని వ్యక్తపరచలేని పిరికితనం!

ఆశించింది జరగాలంటే సాధన కావాలన్నారు, మీరు! వేషాలకోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉండగలను. కాని వరుసగా వారం రోజులు భోజనం లేక పీక్కుపోయిన మొహంతో, లాండ్రీకి వేసే డబ్బులు లేక, మాసిన బట్టలు కట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరుగుతే ఎవరు వేషాలు ఇస్థారు. కనీసం నిలబడే వేషాలు వేస్తూ గడుపుదామనుకున్నా, ఫీల్డులో పాతుకు పోయిన మనుషుల్ని కాదని, నన్నెవరు పిలుస్తారు. ఏ ఆధారం లేకుండా నేనెలా బ్రతకాలి! ఏదో ఒకరోజు ఈ బాధల్తో దిక్కులేని చావు చావాలి. దానికంటే ఆదర్శైజ్డ్‌గా,

నాకై నేనే చనిపోదామనుకున్నాను. నేను పోయేటప్పుడు నా చావు, నా కనీస ఊహక్కూడా అందకూడదు అదే నా నిర్ణయం! అందుకే ఎలక్ట్రిక్ ట్రైయిన్ నుంచీ దూకుదామనుకుంటున్నాను. నా జీవితంలో మలుపు రైలెక్కి మద్రాస్ చేరుకోవడంతో మొదలింది. రైలు దూకడంతో అంతంకావాలి.

అర్ధరాత్రి: 00:01 నిముషం:

సార్! ప్రజలంతా తమకు తెలియకుండానే కొత్తరోజులోకి అడుగుపెట్టారు. నేనిదే రోజు, ఈ జనాన్ని, ఈ ప్రపంచాన్ని వదిలి తెలియని లోకాల్లోకి అడుగుపెడతాను. ఈ మద్రాసులో నామీద పడ్డమచ్చ నాతోనే అంతం కావాలి. ఏదో ఒక ప్రాంతంలో నేను బ్రతికే ఉన్నాననే భావనతో, కనీసం నా తల్లయినా ఆనందంగా ఉండాలి! అందుకే నాకు సంబంధించిన ఆధారాలన్నీ తగులబెట్టేస్తున్నాను. రేపు నా శవాన్ని కూడా ఎవరూ గుర్తుపట్టలేకపోవచ్చు! ఎవడో అనాధ పోయాడని కార్పోరేషన్ వాళ్ళు తీసుకుపోవచ్చు! ఏదెలా జరిగినా, నాకు బాధలేదు. పోయిన తరువాత ఏమైతే నాకేంటి! అయితే, 'గగన్ కుమార్ చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడు', అని మీరనుకోవచ్చు. నన్నొక మోసగాడుగా జమకట్టేస్తారేమోనని, ఆఖరు దశలో అటువంటి అభిప్రాయం మీకు కలిగించకూడదని ఈ ఉత్తరం రాస్తున్నాను, మీరు బాధపడతారని తెలిసికూడా! మీరు నా గురించి విచారించకండి! ఈ కళా ప్రపంచంలో ఎంతమంది అభాగ్యులు కలలు కంటూ పోయారో? అంతకంత మందీ గొప్పవాళ్ళయ్యారు. పోయిన అభాగ్యుల్లో నన్ను జమకట్టకండి -

మీరు నాకిచ్చిన ఆ వందరూపాయలు ఈ జన్మలో ఇవ్వలేకపోతున్నాను. మరోజన్మనేది ఉంటే ఆరోజు వడ్డీతో సహా తీర్చుకుంటాను.

ఈ క్షణంలో నాకొక గేయం జ్ఞాపకం వస్తుంది.

"నేను మరణించుచున్నాను, ఇటు వశించు
నా కొరకుచెమ్మగిలు నయనమ్ములేదు,
పసిడి వేకువ పెండ్లిండ్ల పడిన ఎవరు
కరుగనేరురు జరతాంధకార మృతికి" !

'దేవదాసు'లో ఆ శరత్‌బాబు రాసిన ఆఖరు వాక్యం బహుశా నాకే వర్తించొచ్చు -

"ఈ అభాగ్యుని జీవితం చదివి, ఏవ్యక్తన్నా జాలితో ఒక్క కన్నీటి బొట్టు విడవగలిగితే - అదే అతని ఆత్మకు శాంతి"!

సార్! ఈ అభాగ్యుడి కోసం మీరొక్క కన్నీటి బొట్టు రాల్చరూ.......

అభాగ్యుడు...

గగనకుమార్ .

అక్షరాల మీద జలజలమని కన్నీళ్ళు పడి అలుక్కుపోయాయి. సోఫా మీద వెనక్కి వాలాను! వేడి నిట్టూర్పు నాకు తెలియకుండానే బయటకొచ్చింది. గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

'టప్'మని లైట్ వెలిగింది.

***

"చీకటి పడిపోయింది సార్" అన్నాడు పని కుర్రాడు.

తలూపి లేచి బయటికొచ్చాను. గుండెనిండా ఏదో శూన్యం. గొంతంతా గడ్డ కట్టినట్టయింది. ఆలోచించడానికి కూడా మైండ్ 'స్టక్క'యిపోయింది. తలపగిలి పోతోంది. సారిడాన్ తీసుకుని, నడక మొదలు పెట్టాను. కాళ్ళు వాటికవే పాండీబజారు వైపు

పోతున్నాయి` హోటల్ హమీదియా` మెట్లు ఎక్కుతుండగా `ఢన్` మని ఎవరో డాషిచ్చారు. ఎదురుగా చూసాను. ఇరవైఏళ్ళ కుర్రాడు! చేతిలోంచి జారిన సిగరెట్టును బూటుతో నలుపుతూ "స్టుపిడ్! కళ్ళు నెత్తిన పెట్టుకు నడుస్తున్నావా" అన్నాడు.

అంతలో ఢం. ఢం లక్ష్మణరావు, మరో అయిదుగురితో పరిగెత్తుకుంటూ వచ్చి "నమస్కారం గురుగారూ.." అన్నాడు.

అతను ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"వీరెవరనుకుంటున్నావు. మా గురుగారు.. - డైరెక్టర్ రంగబాబుగారు! గురుగారూ, ఉదయం ఆఫీసులో చెప్పానే, ఇతనిగురించే! మీరు... " అంటూ ఏదో చెప్పుకుపోతున్నాడు. నేనతన్నే గమనిస్తున్నాను. పెద్దకళ్ళు, కర్లింగ్ జుట్టు, బ్లాక్ బెల్ -ఫాంటు, జపాన్ టెరికాట్ షర్ట్ టక్ చేసాడు. పాయింటడ్ షూస్ మెరుస్తున్నాయి. చేతికి గోల్డుపాలిష్డ్ వాచ్, మూడు ఉంగరాలు. అనుకోకుండా వేడి నిట్టూర్పు బయటకు వచ్చింది. గిరుక్కున వెనక్కి తిరిగాను! బజారంతా గందరగోళంగా ఉన్నది. జనంలోంచి నడుచుకెడుతుంటే `విష్` చేసేవాళ్ళు చేస్తూనే ఉన్నారు. తిరిగి `విష్` చేసే మూడ్ కూడా లేదు. చెవుల దగ్గర ఎవరో భీకరంగా ఏడుస్తున్నట్లుగా ఉంది. ఎంతమంది ఈ క్రేజ్‌లో పడి, ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి నాశనం అయిపోతున్నరు. దీనికి కర్తలెవరు. ఆటో ఎక్కి `పాల్స్ రెస్టారెంటు`దగ్గర దిగాను. జాజ్ మ్యూజిక్ మ్రోగుతోంది.

"వన్ లార్జ్ బ్రాంది" అన్నాను.

లార్జ్ మీద లార్జ్ ఫుల్‌గా త్రాగేసి, కౌంటర్ దగ్గర ఫోనెత్తి డయల్ చేసాను.

"హలో" అంది అవతలి గొంతు.

"నేను రంగబాబుని! జయుందా"

"ఒక్క నిమిషం"

నిమిషం తర్వాత "రంగా" అంది జయ.

"ఊఁ"

"ఎక్కణ్ణించి మాట్లాడుతున్నావు"

"పాల్స్ నుండి"

"డ్రింక్ చేసావా"

"బాగా... "

"ఏమైంది"

"బాగా అప్‌సెట్ అయ్యాను! నువ్వు దగ్గరలేకపోతే ఒంటరివాణ్ణయిపోతాను"

"ఏమిటి విషయం చెప్పు" అంది ఆందోళనగా!

"మీ నాన్నగారితో చెప్పి వెంటనే పెళ్ళికి ఎరేంజ్ చెయ్యి"

"అలాగే! ముందు ఏం జరిగిందో చెప్పు"

" ఏం జరిగిందో తర్వాత చెబుతాను! ప్రస్తుతం నేను సినీ ఫీల్డు వదిలేయాలని నిర్ణయించుకున్నాను. "

"నో..." అరిచింది జయ

"ఏఁ..."

"నువ్వు సినీఫీల్డు వదలడానికి వీలు లేదు"

"నువ్వేగా - సినీఫీల్డ్ వదిలేస్తే గానీ మీ నాన్నగారు పెళ్ళికి ఒప్పుకోరన్నావు"

"అప్పుడన్నాను! ఇప్పుడు నాన్న మారిపోయారు నీ పిక్చరు చూసారంట! నీ గురించి హిందూలో రాసిన రివ్యూ చదివారంట. నాన్న బాగా ప్లీజయ్యారు, తనే ఓ పిక్చర్ నీతో ప్రొడ్యూస్ చేద్దామని నిర్ణయించుకున్నారు! ఆ విషయం గురించి నీతో మాట్లాడ్డానికి రేపు వద్దామనుకుంటున్నారు....."

"జయా నా నిర్ణయం...."

"మార్చుకోవాలి! నాకోసం. డోంట్ గెట్ అప్‌సెట్. ప్రపంచంలోని విషయాలన్నీ ఆలోచిస్తూ, మనసు పాడు చేసుకోకు! ఈ సంఘంలో జరిగే ఏ విషయానికి మనం కర్తలం కాదు."

"తెలీదు! కానీ నీ ఆలోచనా విధానం నాకు తెలుసు! కాలచక్రంలో జరిగే సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. దేనికీ మనం బాధ్యులం కాదు! 'ఫ్రెష్'గా అన్ని విషయాలు రేపు మాట్లాడుకుందాం! బై" అని ఫోను పెట్టేసింది.

కేబరే డాన్సరు స్ట్రిప్ టీజ్ చేస్తుంది! తాగిన మైకంలో అందరూ గోలగోలగా అరుస్తున్నారు. నేను బయట కొచ్చాను. మౌంట్ రోడ్ పలచగా ఉంది. ఆటో ఎక్కాను. చివరికి జయకి, వాళ్ళ నాన్నకి కూడా సినిమా పిచ్చి పట్టిందన్నమాట ఏమిటీ క్రేజ్... అర్థం కావడంలేదు.

ఆటో దిగి, ఇంట్లో అడుగుపెట్టాను. హాల్లో కూర్చుని పనికుర్రాడు, టేప్ రికార్డర్‌లో పాటలు వింటున్నాడు.

"ఎవరికెవరు ఈలోకంలో ఎవరికి ఎరుక

ఏదారెటు పోతుందో, ఎవరినీ అడుగక..."

(ఐపోయింది)